




# మన దునియా

మన అక్షరం - మన ప్రపంచం

RNI Number TELTEL/2023/85680



సంపుటి : 3 | సంచిక : 231 | మార్చ్ 8 ఆదివారం 2026 | పేజీలు : 8 | వెల రూ. 4.00/-


# సీనియారిటీ కంటే సిన్సియారిటీకి గౌరవం..

## కమిట్మెంట్‌కు రాజ్యసభ బహుమతి

- టికెట్ కోసం ఆరాటపడకుండా పార్టీ కోసం పనిచేసిన వేం నరేందర్ రెడ్డికి రాజ్యసభ అవకాశం
- సీఎం రేవంత్ రెడ్డి కు సన్నిహితుడిగా ఎదిగిన వేం నరేందర్ రెడ్డి
- సీనియారిటీకి బదులు సిన్సియారిటీకి ప్రాధాన్యం ఇచ్చిన కాంగ్రెస్ అధిష్ఠానం
- రాజకీయాల్లో ఓపికకు దక్కిన ఫలితం
- కుటుంబ రాజకీయ వారసత్వం నుంచి జాతీయ రాజకీయాల వరకు ప్రయాణం
- కాంగ్రెస్‌లో నిబద్ధతకు గుర్తింపుగా రాజ్యసభ అవకాశం



## ఇరాన్‌పై ఇజ్రాయెల్ మెరుపుదాడి.. టెహ్రాన్ విమానాశ్రయంపై క్షిపణుల వర్షం

- మెహరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంపై క్షిపణుల వర్షం
- దాడిలో పలు విమానాలు దగ్ధం, భారీగా ఎగసిపడిన మంటలు
- పశ్చిమాసియాలో తీవ్ర ఉద్రిక్తత, ముడి చమురు ధరలు పెరిగే అవకాశం

పశ్చిమాసియాలో యుద్ధ మేఘాలు మరింత దట్టంగా అలముకున్నాయి. ఇరాన్ రాజధాని టెహ్రాన్‌ను లక్ష్యంగా చేసుకుని ఇజ్రాయెల్ మెరుపు దాడులకు తెగబడింది. నగరంలోని కీలకమైన మెహరాబాద్ అంతర్జాతీయ



## హింసాత్మక చర్యల ద్వారా ఏమి సాధించలేరు: సీఎం రేవంత్ రెడ్డి!


మన దునియా,హైదరాబాద్:మార్చి 07

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎదుట భారీ సంఖ్యలో మావోయిస్టులు లొంగి పోయారు



## వీటి పవర్ చూశాక ఎవరూ అమెరికాతో ఆటలాడుకునే సాహసం చేయరు: ట్రంప్

- ఖరీదైన రాకెట్ల కంటే భారీ తూటాలు పేల్చే నౌకలే మేలన్న ట్రంప్
- గతం కంటే 100 రెట్లు శక్తివంతమైన 10 యుద్ధ నౌకల నిర్మాణం



- భారత్, పాకిస్థాన్ మధ్య విపత్తును నివారించానన్న ట్రంప్
- వాణిజ్యం, టారిఫ్ ల అస్త్రాలతోనే ఇది సాధ్యమైందని వెల్లడి

## పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్తతలు.. గల్ఫ్‌లో అమెరికా యుద్ధ నౌకలు

- పశ్చిమాసియాలో పరాకాష్ఠకు చేరిన ఉద్రిక్తతలు
- గల్ఫ్ జలాల్లోకి అమెరికా శక్తిమంతమైన యుద్ధ నౌకలు
- యూఏఈ, సౌదీపై డ్రోన్, క్షిపణి దాడుల కలకలం
- ఇరాన్‌కు తీవ్ర హెచ్చరికలు జారీ చేసిన వైట్‌హౌస్
- 100 డాలర్ల వైపు పరుగులు తీస్తున్న

### ముడి చమురు ధరలు

పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తీవ్ర స్థాయికి చేరాయి. ఇరాన్,



మన దునియా
మన అక్షరం - మన ప్రపంచం

## హింసాత్మక చర్యల ద్వారా ఏమి సాధించలేరు: సీఎం రేవంత్ రెడ్డి!

(మొదటి పేజీ తరువాయి)

లొంగిపోయిన వారిలో మావోయిస్టు నేతలు దేవ్‌జీ బడే చొక్కారావు, గన్‌మెన్‌లు ఉన్నారు.శనివారం హైదరాబాద్‌లోని కమాండ్ కంట్రోల్ రూంలో డీజీపీ శివధర్ రెడ్డి, ఆధ్వర్యాన సీఎం రేవంత్ రెడ్డి, సమక్షంలో 130 మంది మావోయిస్టులు లొంగిపోయారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ... తెలంగాణ గడ్డపై హింసకు తావు లేదని సీఎం రేవంత్ రెడ్డి, అన్నారు. హింసాత్మక చర్యల ద్వారా ఏమి సాధించలేరని అన్నారు. భారీ సంఖ్యలో మావోయిస్టులు లొంగిపో యేలా పోలీసులు కృషి చేశారని మావోయిస్టుల్లో ఒక నమ్మకాన్ని కలిగిం చారని కొనియాడారు. లొంగిపోయిన మావోయిస్టులు మంచి జీవితం గడిపేలా ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. దేవ్‌జీకి చెందిన పీఎల్‌జీఏ కమిటీ మొత్తం 130 మంది 124 తుపాకులతో లొంగి పోవడం విశేషం. వీటిలో 31 ఏకే 47 తుపాకులు న్నాయి. ఈ సందర్భంగా నక్సల్స్ అప్పగించిన తుపాకులను సీఎం పరిశీలించారు. లొంగిపోయిన వారిలో 125 మంది చత్తీస్‌గఢ్, 4గురు తెలంగాణకు చెందిన అజ్ఞాతంలో ఉన్నవారు , ఒకరు ఏపీకి చెందిన వారని డీజీపీ వెల్లడించారు.

## వీటి పవర్ చూశాక ఎవరూ అమెరికాతో ఆటలాడుకునే సాహసం చేయరు: ట్రంప్

(మొదటి పేజీ తరువాయి)

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తమ రక్షణ రంగానికి సంబంధించి కీలక వ్యాఖ్యలు చేశారు. సైనిక సంపత్తి విషయంలోనూ తమ విధానాన్ని మార్చుకుంటున్నట్లు ఆయన తెలిపారు. దాదాపు 3 మిలియన్ డాలర్ల ఖరీదైన రాకెట్లను వాడటం కంటే.. భారీ తూటాలను ప్రయోగించే యుద్ధ నౌకలే మేలని ఆయన అభిప్రాయపడ్డారు. దీనివల్ల ఖర్చు తగ్గడంతో పాటు శత్రువుల గుండెల్లో భయం పుట్టించవచ్చని ఆయన పరోక్షంగా పేర్కొన్నారు.ప్రస్తుతం అమెరికా ఇలాంటి 10 భారీ యుద్ధ నౌకలను నిర్మిస్తోందని, ఇవి గతంలో కంటే 100 రెట్లు శక్తివంతమైనవని ట్రంప్ వెల్లడించారు. ఈ విధ్వంసకర నౌకలను వాడాలన్నది తమ ఉద్దేశం కాదని, కానీ ఈ శక్తి సామర్థ్యాలు చూసి ఎవరూ అమెరికాతో ఆటలాడుకునే సాహసం చేయరని స్పష్టం చేశారు. చాలా మంది తనను యుద్ధం కోరుకునే వ్యక్తిగా చిత్రీకరిస్తుంటారని, కానీ వాస్తవానికి 8 యుద్ధాలను ముగించింది తానేనని ట్రంప్ గుర్తుచేశారు.రష్యా అధ్యక్షుడు పుతిన్, ఉక్రెయిన్ అధినేతల మధ్య తీవ్రమైన ద్వేషం ఉందని, వారిని చర్చలకు ఒప్పించడం చాలా కష్టమైన పని అని ట్రంప్ వ్యాఖ్యానించారు. సముద్రం అడ్డుగా ఉండటం వల్ల ఆ యుద్ధం ప్రభావం అమెరికాపై పెద్దగా ఉండదని, కేవలం యూరప్ కు మేలు చేసేందుకే తాను ఈ ప్రయత్నాలు చేస్తున్నానని చెప్పారు. ఇదే సమయంలో భారత్-పాకిస్థాన్ల మధ్య ఉద్రిక్తతలపైనా ఆయన స్పందించారు. ఆ రెండు దేశాల మధ్య పరిస్థితులు చేయిదాటిపోయేలా ఉన్నప్పుడు, తాను వాణిజ్యపరమైన సుంకాలను అస్త్రంగా ప్రయోగించి సమస్యను పరిష్కరించానని, ప్రజల ప్రాణాలను కాపాడానని ట్రంప్ పేర్కొన్నారు. ప్రజలను ఏకతాటిపైకి తీసుకురాగల సామర్థ్యం తనకుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

## ఇరాన్‌పై ఇజ్రాయెల్ మెరుపుదాడి.. టెహ్రాన్ విమానాశ్రయంపై క్షిపణుల వర్షం

(మొదటి పేజీ తరువాయి)

విమానాశ్రయంపై ఇజ్రాయెల్ యుద్ధ విమానాలు క్షిపణుల వర్షం కురిపించాయి. ఈ దాడిలో విమానాశ్రయంలో భారీ ఎత్తున మంటలు చెలరేగి, రన్‌వేపై ఉన్న పలు విమానాలు దగ్ధమయ్యాయి. ఆ ప్రాంతమంతా దట్టమైన నల్లటి పొగలు కమ్ముకోవడంతో భయానక వాతావరణం నెలకొంది.ఈ హఠాత్పరిణామంతో టెహ్రాన్ నగరం ఉలిక్కిపడింది. విమానాశ్రయ పరిసర ప్రాంతాల ప్రజలు భయాందోళనలతో సురక్షిత ప్రాంతాలకు పరుగులు తీశారు. ఇజ్రాయెల్ జెట్‌లను అడ్డుకునేందుకు ఇరాన్ ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థ ప్రయత్నించినప్పటికీ ఫలితం లేకపోయినట్లు తెలుస్తోంది. దాడుల నేపథ్యంలో విమానాశ్రయం నుంచి రాకపోకలను పూర్తిగా నిలిపివేశారు. ఈ ఘటనలో ప్రాణనష్టంపై ఇరాన్ ప్రభుత్వం ఇంకా ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు.మెహరాబాద్ విమానాశ్రయం కేవలం పౌర విమాన సర్వీసులకే కాకుండా, ఇరాన్ సైనిక రవాణాకు కూడా కీలక కేంద్రంగా ఉంది. ఇరాన్ వైమానిక సరఫరా మార్గాలను దెబ్బతీయాలనే వ్యూహంతోనే ఇజ్రాయెల్ ఈ దాడికి పాల్పడినట్లు విశ్లేషకులు భావిస్తున్నారు. ఒకవైపు గల్ఫ్ తీరంలో అమెరికా నౌకలు మోహరించి ఉండగా, ఇజ్రాయెల్ నేరుగా ఇరాన్ రాజధానిపై దాడి చేయడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. ఈ పరిణామాల ప్రభావంతో అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు పెరిగే ప్రమాదం ఉందని ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు.



## సీనియారిటీ కంటే సిన్సియారిటీకి గౌరవం..

మన దునియా,వరంగల్: మార్చి 07

రాజకీయాల్లో స్నేహం, త్యాగం, కమిట్మెంట్‌లకు విలువ ఉండదని సాధారణంగా అనిపించినా సరైన సమయం వచ్చినప్పుడు అవే నాయకుడి మెరిట్స్‌గా మారి పదవులను అందించే ఉదాహరణగా వేం నరేందర్ రెడ్డి నిలిచారు. కాంగ్రెస్ పార్టీ తరఫున వేం నరేందర్ రెడ్డి రాజ్యసభకు ఎన్నిక కావడం ప్రస్తుతం తెలంగాణ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. సీనియర్ నాయకులను పక్కనపెట్టి ఆయనకు అవకాశం ఇవ్వడం కాంగ్రెస్‌లోని ఒక వర్గంలో అసంతృప్తిని రగిలించినా, సీనియారిటీ కంటే సిన్సియారిటీకి ప్రాధాన్యం ఇచ్చి అధిష్టానం ఈ నిర్ణయం తీసుకున్నట్టు రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.గత రెండు అసెంబ్లీ ఎన్నికలు (2018, 2023) అలాగే 2019, 2024 లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసే అవకాశాలు ఉన్నప్పటికీ టికెట్ కోసం ఆరాటపడకుండా పార్టీ కోసం తెరవెనుక పనిచేసిన వేం నరేందర్ రెడ్డి, సీఎం రేవంత్ రెడ్డికి సన్నిహితుడిగా పార్టీ వ్యవహారాలు చూసుకుంటూ వచ్చారు. అదే ఓపిక ఇప్పుడు ఆయనకు మెరిట్‌గా మారి రాజ్యసభ స్థానం దక్కేలా చేసింది.ఉమ్మడి వరంగల్ జిల్లా కేసముద్రం మండలానికి చెందిన వేం నరేందర్ రెడ్డి కుటుంబానికి ప్రాంతంలో రాజకీయంగా మంచి పట్టు ఉంది. రజాకార్ల వ్యతిరేక పోరాటంలో ఆయన కుటుంబం పాల్గొనగా, ఆయన తాత పుల్లారెడ్డి ఆ పోరాటంలో పాల్గొన్న వ్యక్తిగా గుర్తింపు పొందారు. ఆయన తండ్రి చెన్నకృష్ణారెడ్డి సర్పంచ్, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్‌గా పనిచేయగా, సోదరుడు పురుషోత్తం రెడ్డి జడ్పీటీసీగా, వదిన ఉమా సర్పంచ్‌గా పనిచేశారు.మొదట జనతాపార్టీలో క్రియాశీలకంగా ఉన్న వేం నరేందర్ రెడ్డి తరువాత టీడీపీలో చేరి రాజకీయాల్లో కొనసాగారు. 2001 జిల్లా పరిషత్ ఎన్నికల్లో జడ్పీ చైర్మన్ లక్ష్యంగా నల్లబెల్లి మండలం నుంచి పోటీ చేసి తెరాస అభ్యర్థి పెద్ది సుదర్శన్ రెడ్డి చేతిలో ఓటమి పాలయ్యారు.అయితే 2004 అసెంబ్లీ ఎన్నికల్లో అనూహ్యంగా మహబూబాబాద్ నుంచి టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసి కాంగ్రెస్, జనతా పార్టీ అభ్యర్థుల మధ్య ఓట్ల చీలికతో కేవలం మూడు వేల మెజారిటీతో విజయం సాధించారు. ఆ ఎన్నికల్లో వేం నరేందర్ రెడ్డికి 50,348 ఓట్లు రాగా, భరత్ చంద్రారెడ్డికి 47,059, రాజవర్ధన్ రెడ్డికి 41,757 ఓట్లు వచ్చాయి.తర్వాతి రాజకీయ పరిణామాల్లో 2009లో వరంగల్ ఈస్ట్ నుంచి నామినేషన్ వేసినప్పటికీ రాజకీయ సమీకరణాల నేపథ్యంలో విత్‌డ్రా చేసుకున్నారు. 2010 ఉపఎన్నికల్లో పోటీ చేసినా గణనీయమైన ఓట్లు రాకపోవడంతో డిపాజిట్ కోల్పోయారు.2015లో ఎమ్మెల్సీ ఎన్నికల సమయంలో జరిగిన ఓటుకు నోటు కేసు తర్వాత రేవంత్ రెడ్డి, వేం నరేందర్ రెడ్డిల మధ్య బంధం మరింత బలపడింది. 2017లో రేవంత్ రెడ్డితో పాటు కాంగ్రెస్ పార్టీలో చేరిన వేం నరేందర్ రెడ్డి అప్పటి నుంచి పార్టీకి బ్యాక్ ఆఫీస్ రాజకీయాల్లో కీలక పాత్ర పోషిస్తున్నారు.తెలంగాణ కాంగ్రెస్‌లో పాత, కొత్త నాయకుల మధ్య వివాదాలు కొనసాగుతున్న నేపథ్యంలో అధిష్టానం మాత్రం పార్టీకి ఉపయోగపడే నాయకులకు అవకాశాలు ఇవ్వాలనే విధానాన్ని కొనసాగిస్తోంది. జీవన్ రెడ్డి, కోదండరెడ్డి, మధు యాష్కీ వంటి సీనియర్ నాయకులు పోటీలో ఉన్నప్పటికీ సీఎం కోటాలో వేం నరేందర్ రెడ్డికి రాజ్యసభ దక్కడం ఆయన పార్టీ పట్ల చూపిన కమిట్మెంట్‌కు గుర్తింపుగా భావిస్తున్నారు.రాజకీయాల్లో ఓపికతో, నిబద్ధతతో పనిచేస్తూ అవకాశాల కోసం వేచిచూసిన నాయకుడికి చివరకు ఫలితం దక్కుతుందనే విషయాన్ని వేం నరేందర్ రెడ్డి రాజకీయ ప్రయాణం మరోసారి రుజువు చేసింది.

## పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్తతలు.. గల్ఫ్‌లో అమెరికా యుద్ధ నౌకలు

(మొదటి పేజీ తరువాయి)

దాని మిత్రపక్షాల నుంచి ఎదురవుతున్న ముప్పును ఎదుర్కొనేందుకు అమెరికా తన శక్తిమంతమైన యుద్ధ నౌకలను గల్ఫ్ జలాల్లో మోహరించింది. యూఏఈ, సౌదీ అరేబియాలపై దాడులు జరిగిన కొన్ని గంటల్లోనే అగ్రరాజ్యం ఈ నిర్ణయం తీసుకోవడం అంతర్జాతీయంగా ఆందోళన కలిగిస్తోంది.గత 24 గంటల వ్యవధిలో యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ), దుబాయ్, సౌదీ అరేబియాలోని కీలక ప్రాంతాలే లక్ష్యంగా డ్రోన్లు, క్షిపణులతో దాడులు జరిగాయి. ముఖ్యంగా చమురు నిల్వలు, వాణిజ్య కేంద్రాలపై ఈ దాడులు జరగడం పరిస్థితిని మరింత తీవ్రతరం చేసింది. ఈ దాడుల వెనుక ఇరాన్ మద్దతున్న గ్రూపుల హస్తం ఉందని అమెరికా నిఘా వర్గాలు భావిస్తున్నాయి.ఈ పరిణామాల నేపథ్యంలో అమెరికా అప్రమత్తమైంది. ఆయా ప్రాంతాల్లో ఉన్న తమ పౌరులు తక్షణమే సురక్షిత ప్రాంతాలకు వెళ్లిపోవాలని హెచ్చరికలు జారీ చేసింది. ఒకవేళ ఇజ్రాయెల్ లేదా తమ అరబ్ మిత్రదేశాలపై ఇరాన్ నేరుగా దాడికి పాల్పడితే తీవ్ర పరిణామాలు తప్పవని వైట్‌హౌస్ స్పష్టం చేసింది. మరోవైపు, ఇరాన్ కూడా తమ రాజధాని టెహ్రాన్ చుట్టూ రక్షణ వ్యవస్థలను పటిష్ఠం చేసుకుంటున్నట్లు సమాచారం.ఈ యుద్ధ వాతావరణం ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపుతోంది. అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధర బ్యారెల్‌కు 100 డాలర్ల దిశగా దూసుకెళ్తోంది. ఒకవేళ ఇరాన్ కీలకమైన నౌకా రవాణా మార్గాలను అడ్డుకుంటే, భారత్ వంటి దేశాలకు చమురు సరఫరాపై తీవ్ర ప్రభావం పడుతుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం దౌత్యపరమైన చర్చలు ఫలించకపోవడంతో, ప్రత్యర్థిని కట్టడి చేసేందుకు అమెరికా తన సైనిక శక్తిని ప్రదర్శిస్తోంది.

# రేవంత్ రెడ్డికి అమెరికాలోని డెలావర్ రాష్ట్ర గవర్నర్ ఆహ్వానం

### రేవంత్ రెడ్డిని కలిసిన డెలావర్ గవర్నర్ మాట్ మేయర్

### ప్రజాక్షేమం, పాలనా సంస్కరణలపై చర్చ

### డెలావర్ రాష్ట్ర పర్యటనకు రావాలని రేవంత్ కు ఆహ్వానం



అమెరికాలోని డెలావర్ రాష్ట్ర గవర్నర్ మాట్ మేయర్ హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో భేటీ అయ్యారు. ఈ సమావేశంలో ఇరు రాష్ట్రాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలు, ముఖ్యంగా ఆరోగ్యం, విద్య మరియు సాంకేతిక రంగాలలో పరస్పర సహకారంపై కీలక చర్చలు జరిగాయి.వీరి భేటీలో ప్రజాక్షేమం, పాలనా సంస్కరణలే ప్రధాన ఎజెండాగా నిలిచాయి. డెలావర్ రాష్ట్రంలో తాము విజయవంతంగా అమలు చేసిన పేద, మధ్యతరగతి ప్రజల గృహ నిర్మాణ పథకాలు, రుణమాఫీ కార్యక్రమాల గురించి మాట్ మేయర్ ఈ సందర్భంగా వివరించారు. ముఖ్యంగా అందరికీ నాణ్యమైన వైద్యం అందించే 'యూనివర్సల్ హెల్త్ కేర్' విధానంపై ఇద్దరు నేతలు సుదీర్ఘంగా చర్చించారు. సాంకేతిక యుగంలో అతి ముఖ్యమైన అంశాలైన సమాచార భద్రత, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) వినియోగంలో పాటించాల్సిన నిబంధనలపై కూడా ఇరువురు తమ అభిప్రాయాలను పంచుకున్నారు.తెలంగాణలో జరుగుతున్న అభివృద్ధిని, ఇక్కడి మౌలిక సదుపాయాలను అభినందించిన గవర్నర్ మాట్ మేయర్, భవిష్యత్తులో రెండు రాష్ట్రాల మధ్య ఆర్థిక మరియు సాంకేతిక బంధం మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు. ఇదే క్రమంలో, తెలంగాణ నుండి ఒక అధికారిక ప్రతినిధుల బృందంతో కలిసి డెలావర్ రాష్ట్ర పర్యటనకు రావాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఆయన ప్రత్యేకంగా ఆహ్వానించారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, డెలావర్ ఫస్ట్ లేడీ లారెన్ మేయర్‌తో పాటు ప్రభుత్వ ఉన్నతాధికారులు పాల్గొని, రెండు రాష్ట్రాల మధ్య కుదుర్చుకోబోయే భవిష్యత్ ఒప్పందాల గురించి ప్రాథమిక చర్చలు జరిపారు.

మన దునియా
మన అక్షరం - మన ప్రపంచం
మార్చ్ । ఆదివారం । 8 । 2026



# గ్యాస్ ధరల షాక్-నేటి నుంచి ఒక్కో సిలిండర్ పై పెంపు ఇలా..!

**మన దునియా హైదరాబాద్: మార్చి 07**

ఇరాన్ పై అమెరికా-ఇజ్రాయెల్ ప్రారంభించిన యుద్ధం, దానికి ప్రతిగా ఆ దేశం చేస్తున్న ప్రతిదాడులు భారత్ పై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. అంతా ఊహించినట్లుగానే గ్యాస్ ధరల మంట ప్రారంభమైంది. హార్ముజ్ జలసంధి నుంచి ఎల్పీజీ సరఫరాలపై ప్రభావం పడుతున్న నేపథ్యంలో కేంద్రం గ్యాస్ ధరలు పెంచేసింది. ఇవాళ్టి నుంచి ఇళ్లకు వాడే సిలెండర్లతో పాటు వాణిజ్య సిలెండర్లపైనా భారీగా రేట్లు పెంచుతూ చమురు కంపెనీలు నిర్ణయం తీసుకున్నాయి.దేశవ్యాప్తంగా 14.2 కిలోల గృహోపకరణాల వంట గ్యాస్ సిలిండర్ ధర రూ.60 పెరిగింది. అదేవిధంగా 19 కిలోల వాణిజ్య ఎల్పీజీ సిలిండర్ ధర కూడా రూ.115 పెరిగింది. దీని ప్రభావం హోటళ్ళు, రెస్టారెంట్లు, చిన్న వాణిజ్య సంస్థలపై పడబోతోంది. పెరిగిన గ్యాస్ సిలెండర్ ధరలు ఇవాళ్టి నుంచే అమల్లోకి వస్తున్నాయి. ఢిల్లీలో 14.2 కిలోల గృహోపకరణాల ఎల్పీజీ సిలిండర్ ధర రూ.853 నుండి రూ.913 కు పెరిగింది. ముంబైలో కొత్త రేటు ఇప్పుడు రూ.852.50గా ఉంది. కోల్‌కతాలో ధర రూ.879 నుండి రూ.030 కు పెరిగింది. చెన్నైలో ఇది రూ.868.50 నుండి రూ.928.50 కు పెరిగింది.మరోవైపు ఢిల్లీలో 19 కిలోల వాణిజ్య సిలిండర్ ధర రూ.1768.50 నుండి రూ.1883కి పెరిగింది. ముంబైలో కమర్షియల్ సిలెండర్ ధర రూ.1720.50 నుండి రూ.1835కి పెరిగింది. అలాగే కోల్‌కతాలో ధర రూ.1875.50 నుండి రూ.1990కి పెరిగింది, చెన్నైలో ఇది రూ.1929 నుండి రూ.2043.50కి పెరిగింది.



వాస్తవానికి గ్యాస్ సిలెండర్ ధరలు గతేడాది ఏప్రిల్ నుంచి మారలేదు. ఇరాన్ వార్ నేపథ్యంలో భారతదేశ ఇంధన సరఫరా, ఇంధన లభ్యతపై పెరుగుతున్న ఆందోళనల నేపథ్యంలో ఈ పెంపు అమల్లో వచ్చిది. దీంతో దేశంలో ఇంధన కొరత లేదని, సరఫరాలో అంతరాయాల గురించి వినియోగదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కేంద్ర పెట్రోలియం మరియు సహజ వాయువు మంత్రి హర్దీప్ సింగ్ పూరి గతంలో చెప్పిన మాటలు నిజం కాదని తేలిపోయింది.

# నిలువ నీడ కరువాయ్యే...

**ఫ్లెక్సీల నీడనే ఆర్టీసి బస్సుల కోసం ప్రయాణికుల నిరీక్షణ**

**బస్సు షెల్టర్ లేక ప్రయాణికుల ఇక్కట్లు**

**మన దునియా,గద్వాల:మార్చి 07**

గద్వాల:మండుటెండల్లో మలమల మాడుతున్నారు. అకాల వర్షాలతో తడుస్తున్నారు. అయిన అధికారుల్లో చలనం కరువాయ్యే. బస్సు షెల్టర్ లు లేక ప్రయాణికులు నరకయాతన పడుతుంటే ఆర్టీసి అధికారులు కాని, జిల్లా ఉన్నతాధికారులు స్పందన కరువాయే. ప్రయాణికుల పడుతున్న నరకయాతన ఎంతోకాలంగా వెల్లువెత్తుతున్నా సంబంధిత యంత్రాంగాలకు చీమకుట్టినట్లు కూడా లేదు. ఈ నేపథ్యంలో గద్వాల పట్టణంలో బస్‌షెల్టర్లు దుస్థితి..ప్రయాణికుల వెతలపై స్పెషల్ స్టోరీ.. జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలో పాతబస్టాండ్, సర్కార్ హాస్పిటల్, మున్సిపల్ ఆఫీస్ తదితర ప్రాంతాలలో ఆర్టీసి బస్సు షెల్టర్ లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. శరవేగంగా అభివృద్ధి చెందుతున్న గద్వాల పట్టణంలో నిత్యం వేలాది మంది ప్రయాణికులు గద్వాల మీదుగా రాకపోకలు సాగిస్తున్నారు. గద్వాల మీదుగా కర్నూల్, హైదరాబాద్, రాయచూర్, మక్తల్, మంత్రాలయం, అయిజ వివిధ ప్రాంతాలకు ప్రయాణికులు నిత్యం ప్రయాణిస్తుంటారు. ఆర్టీసి బస్సులు వచ్చే సమయం వరకు వేచి ఉండే ప్రయాణికులు బస్ షెల్టర్ లేక ఎండకి ఎండుతూ వానకు తడుస్తూ ప్రయాణించవలసిన పరిస్థితి నెలకొంది. ఆర్టీసీ అధికారులు ఆర్టీసీ ప్రయాణం సురక్షితం ఆర్టీసీ బస్సులోనే ప్రయాణం చేయాలి, అని చెబుతున్న ఆర్టీసీ ప్రయాణికులకు సౌకర్యాలు కల్పించడంలో ఆ శాఖ అధికారులు విఫలమైనట్లు ప్రయాణికులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం



ఉచిత బస్సు సౌకర్యం కల్పించడంతో ప్రయాణికుల సంఖ్య పెరుగుతుంది. దానికి అనుగుణంగా గద్వాలలో పాతబస్టాండ్(విష్ణు ప్రియ హోటల్ ఎదురుగా, ఆపోలో ఫార్మర్సి మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్), ప్రభుత్వ ఆసుపత్రి, ఆంధ్రబ్యాంకు ఏటిఎం(మున్సిపల్ ఆఫీస్ ఎదురుగా), కొత్త కలెక్టరేట్, తదితర ప్రాంతాలలో బస్సు షెల్టర్ ఏర్పాటు చేస్తే ప్రయాణికులకు ఎంతో సౌకర్యవంతంగా ఉంటుందని ప్రయాణికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. గద్వాల జిల్లా ఏర్పడి పదేండ్లు కావొస్తున్న గద్వాల ఆర్టీసీ అధికారులు ప్రయాణికుల కోసం బస్సు షెల్టర్ లు ముందుకు రాకపోవడంతో శోచనీయం. ఫ్లెక్సీ నీడనే ఆసర చేసుకుని బస్సుల కోసం నిరీక్షణ చేయాల్సి వస్తుందని ప్రయాణికులు ఆవేధన చెందుతున్నారు. గద్వాలలో ప్రయాణికులు సౌకర్యార్థం అనువైన ప్రాంతాలలో బస్ షెల్టర్ లు ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని ఈ ప్రాంత ప్రయాణికులు కోరుతున్నారు.

# విద్యార్థులు పదవ తరగతి పరీక్షలలో ప్రతిభ కనబర్చాలి

**నిర్దవెల్లి సర్పంచ్ భాస్కర్ గౌడ్**

**విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు,పెన్నులను పంపిణీ చేసిన ఉప సర్పంచ్ సపూరా ఆమేర్**

**మన దునియా,కేశంపేట:మార్చి 07**

కేశంపేట మండల పరిధిలోని నిర్దవెల్లి గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు శనివారం గ్రామ ఉప సర్పంచ్ సపూరా ఆమేర్ పరీక్ష ప్యాడ్లను, పెన్నులను పంపిణీ చేశారు. విద్యార్థులు పరీక్షలను ధైర్యంగా, ఏకాగ్రతతో రాయాలని సూచిస్తూ పరీక్ష ప్యాడ్లను పెన్నులను అందజేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ భాస్కర్ గౌడ్ మాట్లాడుతూ పదో తరగతి పరీక్షలు విద్యార్థుల జీవితంలో ముఖ్యమైన మలుపు అని తెలిపారు. కష్టపడి చదివి మంచి ఫలితాలు సాధించాలని విద్యార్థులను ప్రోత్సహించారు.విద్యార్థులు లక్ష్యసాధన కోసం క్రమశిక్షణతో చదవాలని, భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు చేరాలని ఆకాంక్షించారు.పరీక్షల సమయంలో విద్యార్థులకు అవసరమయ్యే ప్యాడ్లను పెన్నులను పంపిణీ చేసిన ఉప సర్పంచ్ సపూరా ఆమేర్ కు విద్యార్థులు ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం చంద్రశేఖర్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి విజయ్ కుమార్ వార్డు సభ్యులు నాగరాజు, రమేష్, చంద్రయ్య, రిజ్వానబేగం మోహిజ్ నాయకులు జంగయ్య, ఖాజాపాషా, ముత్యాలు, శేఖరప్ప, రాజేందర్, సాయి, రమేష్ పాఠశాల ఉపాధ్యాయులు,విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు..



## రైతులకు రైతు భరోసా వెంటనే చెల్లించాలి.

- రైతులకు ఆప్ తో సంబంధం లేకుండా తగినంత యూరియా అందించాలి



**మన దునియా (ప్రతినిధి శరత్) మార్చి 07, జన్నారం.**

జన్నారం మండల కేంద్రంలో రైతు సంఘం జనరల్ బాడీ సమావేశం కొండగుర్ల లింగన్న అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి బోడెంకి చందు రైతు సంఘం జిల్లా కార్యదర్శి హాజరై మాట్లాడుతూ ఉత్పత్తిదారుడైన రైతు అభివృద్ధికి ప్రభుత్వాలు చేయుత ఇవ్వాలని, కానీ ప్రభుత్వాలు యాప్ ల పేరుతో రైతులను మరింత ఇబ్బంది పెడుతున్నారని, రైతులకు ఇప్పటివరకు రైతు భరోసా, రైతు రుణమాఫీ అందలేదని, కౌలు రైతులకు భరోసా ఇవ్వాలని, స్వామినాథన్ సిఫార్సులు ఎ2+50 అమలు చేయాలని ఉన్న అమలు చేసే దాంట్లో రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు విఫలమయ్యా యని , రైతులకు సబ్సిడీ ద్వారా పనిముట్లు అందించాలని, రైతు సమస్యల పరిష్కారానికి పోరాటాలకు రైతులు కదలి వచ్చి ప్రభుత్వాల మెడలు వంచి సమస్యలు పరిష్కరించుకోవాలని పిలుపునిచ్చారు

అనంతరం రైతు సంఘం జన్నారం నూతన మండల ఎన్ను కోవడం జరిగింది

అధ్యక్షులు:- కుక్కటికారి శ్రీనివాస్

కార్యదర్శి:- దుర్గం దుర్గాప్రసాద్

ఉపాధ్యక్షులు:- ఒడిపెల్లి చంద్రన్న, కోరుట్ల శంకరయ్య,

సహాయ కార్యదర్శిలు:- అంబటి కాంతాయ్య, గడ్డం విజయ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో కే అశోక్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి, అంబటి లక్ష్మణ్ సిఐటియు మండల కన్వీనర్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు

**మన దునియా,మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ:మార్చి 07**



అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండల కేంద్రంలోని ప్రభుత్వ గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో శనివారం ముందస్తు వేడుకలను అత్యంత ఉత్సాహంగా నిర్వహించారు.సమాజంలో మహిళల పాత్ర, వారి సాధికారత మరియు విద్య యొక్క ప్రాముఖ్యతను ఉపాధ్యాయులు విద్యార్థినులకు వివరించారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని తోటి ఉపాధ్యాయులు ఆకాంక్షించారు.“మహిళలు కేవలం ఇంటికే పరిమితం కాకుండా, చదువుతోనే ఉన్నత శిఖరాలను అధిరోహించగలరు. నేటి బాలికలే రేపటి ఆదర్శ మహిళలు.“ ఉపాధ్యాయులు, విద్యార్థినులు కలిసి ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, వార్డెన్ మరియు విద్యార్థినులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## గజ్వేల్ తాసిల్దార్ ఇంట్లో ఏసీబీ సోదాలు!

**మన దునియా,కరీంనగర్ జిల్లా:మార్చి 07**

కరీంనగర్ జిల్లా కేంద్రంలో ఏసీబీ అధికారులు శనివారం మెరుపు దాడి నిర్వహించారు. సిద్దిపేట జిల్లా గజ్వేల్ తాసిల్దార్ శ్రావణ్ కుమార్,ఇంట్లో శనివారం తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో భారీగా నగదు కీలక పత్రాలు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం విచారణ కొనసాగుతుంది...ఆదాయానికి మించిన ఆస్తులు ఉన్నాయన్న సమాచారంతో ఈ తనిఖీలు నిర్వహించారు. నగరంలోని మహారాజా బార్ అండ్ రెస్టారెంట్ వెనుక ఉన్న ఇంటితో పాటు.. ఆర్టీసీ కాలనీలో రెండు చోట్ల ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహిస్తున్నారు. వీటితో పాటు శ్రావణ్ కుమార్ తండ్రి ఇంటి వద్ద లక్ష్మీ నగర్లోని సోదరి ఇంట్లో సైతం ఏసీబీ అధికారులు సోదాలు కొనసాగుతున్నాయి.



మన దునియా
మన అక్షరం - మన ప్రపంచం

# సినీ నటుడు మురళీధర్ గౌడ్ ఇంట విషాదం

**మన దునియా,రామాయంపేట: మార్చి 07**



మురళీధర్ భార్య ఐరేని శశికళ(58) మృతి చెందారు. గత కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆమె చికిత్స పొందుతూ గురువారం మరణించారు. ఈ ఘటనతో మురళీధర్ గౌడ్ కుటుంబంలో విషాదఛాయలు అలముకున్నాయి. గతంలో రామాయంపేట గ్రామ పంచాయతీగా ఉన్న సమయంలో ఆమె వార్డు సభ్యురాలిగా ఎన్నికై ప్రజలకు సేవలు అందించారు. విషయం తెలిసిన పలువురు సినీ ప్రముఖులు సంతాపం వ్యక్తం చేస్తున్నారు.మురళీధర్ గౌడ్ ఎలక్ట్రిసిటీ డిపార్ట్‌మెంట్‌లో పని చేసి రిటైర్ అయిన తర్వాత నటనపై ఆసక్తితో సినీరంగంలోకి అడుగుపెట్టారు. 2018లో వచ్చిన 'రంగస్థలం' సినిమాతో ఆయన సినిమా ప్రయాణం ప్రారంభమైంది.తర్వాత 2022లో విడుదలైన 'డీజే టిల్లు' సినిమాలో సిద్దు జొన్నలగడ్డ తండ్రి పాత్రలో నటించి మంచి గుర్తింపు పొందారు. ఆ తరువాత 'బలగం' సినిమా ఆయనకు మరిన్ని అవకాశాలను తెచ్చిపెట్టింది. 'మేము ఫేమస్', 'మ్యాడ్', 'టిల్లు స్క్వేర్' వంటి సినిమాలతో కూడా ప్రేక్షకుల్లో ప్రత్యేక గుర్తింపు సంపాదించారు.

# ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం

**విద్యార్థులు లక్ష్యాలను ఏర్పరచుకోవాలి**

**8వ వార్డు కౌన్సిలర్ సుధీర్**

**మన దునియా,ఫరూఖ్‌నగర్: మార్చి 07**



ఫరూఖ్‌నగర్ మండలంలోని ఆర్.టి.సి కాలనీ ప్రాథమిక పాఠశాలలో 'స్వయం పరిపాలన దినోత్సవాన్ని' శనివారం అత్యంత ఉత్సాహంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వార్డు కౌన్సిలర్ సుధీర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ... ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించాలని పిలుపునిచ్చారు. చిన్నప్పటి నుండే ఉన్నతమైన లక్ష్యాలను ఏర్పరచుకుని, వాటి సాధన కోసం కృషి చేయాలని సూచించారు. విలువలతో కూడిన విద్యే భవిష్యత్తుకు బలమైన పునాది అని ఆయన కొనియాడారు. అనంతరం, అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని పాఠశాలలోని మహిళా ఉపాధ్యాయులను కౌన్సిలర్ సుధీర్ ఘనంగా సన్మానించారు. సమాజ నిర్మాణంలో మహిళా ఉపాధ్యాయుల పాత్ర వెలకట్టలేనిదని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వి. రజిత, ఉపాధ్యాయులు లక్ష్మీదేవమ్మ, మాధవాచారి, వనజ, ధనలక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

# చటాన్ పల్లి రూపురేఖలు మార్చడమే లక్ష్యం

**3వ వార్డు కౌన్సిలర్ నందారం అశోక్ యాదవ్**

**ప్రజా పాలన - ప్రగతి ప్రణాళికలో భాగంగా అభివృద్ధి**


**మన దునియా,చటాన్ పల్లి: మార్చి 07**



అభివృద్ధి పరంగా చటాన్ పల్లి రూపురేఖలు మార్చడమే లక్ష్యం అని షాద్ నగర్ 3వ వార్డు కౌన్సిలర్ నందారం అశోక్ యాదవ్ తెలిపారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా షాద్ నగర్ మున్సిపల్ ఆధ్వర్యంలో మూడో వార్డులో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. ఇందులో భాగంగా పిచ్చి మొక్కలను తొలగించడం డ్రైనేజీ సమస్యలను తీర్చడం రోడ్లు మురికి కాలువలు పారిశుద్ధ్యం వంటి కార్యక్రమాలను మొదటి రోజు చేపట్టారు. మొత్తం 99 రోజుల ప్రణాళికలో భాగంగా ఆయా ప్రాంతాల్లో వార్డు పరిధిలో పూర్తిస్థాయి ప్రణాళిక చర్యలు చేపడతామని అశోక్ యాదవ్ స్పష్టం చేశారు. మున్సిపాలిటీ వార్డులో తడి, పొడి చెత్త సేకరణ, పిచ్చి మొక్కలు తొలగింపు, ప్రభుత్వ భవనాల్లో శుభ్రత కార్యక్రమాలు చేపడుతామని వివరించారు..

# మేడారం జాతరకు వెళ్లి యువతిని ట్రాప్ చేసి పెళ్లి చేసుకున్న ట్రాఫిక్ హోం గార్డు

**మన దునియా,హైదరాబాద్, అబిడ్స్:మార్చి 07**




హోం గార్డుకు పెళ్ళై ముగ్గురు పిల్లలున్నా పెళ్లికి ఒప్పుకున్న యువతి అబిడ్స్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్లో హోంగార్డుగా పని చేస్తున్న శ్రీకాకుళంకు చెందిన పొంగూరు వాసుదేవరావు(38)ఆయనకు ఇదివరకే వివాహం అయి ముగ్గురు పిల్లలు ఉండగా.. ఇద్దరు కూతుళ్లను తీసుకొని ఇటీవల తన స్వగ్రామానికి వెళ్లిన భార్యఏడేళ్ల కొడుకుతో జగద్గిరిగుట్టలో అద్దెకుంటూ అబిడ్స్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్లో హోంగార్డుగా పని చేస్తూ మేడారం జాతరకు విధులపై వెళ్లిన వాసుదేవరావు అయితే అక్కడ తల్లి కనిపించడం లేదంటూ వాసుదేవరావు కూర్చున్న ట్రాఫిక్ బూత్‌ను ఆశ్రయించిన యువతి(25) గంట వ్యవధిలోనే ఆమె తల్లిని కనుగొని అప్పగించడం.. అనంతరం యువతితో పరిచయం కాస్తా ప్రేమకు దారి తీయడంతో.. గత నెల 25వ తేదీన అమీర్‌పేట్‌లోని కనకదుర్గ అమ్మవారి దేవాలయంలో మొదటి భార్యకు తెలియకుండా పెళ్లి చేసుకున్న వాసుదేవరావు అయితే తరచూ తన కూతురు బయటికి వెళ్తుండటాన్ని గమనించి ఆరా తీయగా వాసుదేవరావును పెళ్లి చేసుకున్నట్లుగా తండ్రికి తెలిపిన యువతి  యువతి ఇంట్లో తెలియడంతో తమకు రక్షణ కావాలంటూ తాను వివాహం చేసుకున్న యువతిని తీసుకొని బంజారాహిల్స్ పోలీసులను ఆశ్రయించిన వాసుదేవరావు ఘటన వివరాలు ఆరా తీసి విచారణ చేపట్టి ఆ యువతి మేజర్ కావడంతో హోంగార్డుతో పంపించి.. ఈ విషయంపై మొదటి భార్య నుంచి తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపిన పోలీసులు

# మార్చి 28న జాతీయ లోక్ అదాలత్





- **షాద్ నగర్ జిల్లా అదనపు న్యాయమూర్తి ఎస్. స్వాతి రెడ్డి**
- **లోక్ అదాలత్ కోసం అధికారులతో జాతీయ లోక్ అదాలత్ సన్నాహక సమావేశం**
- **షాద్ నగర్ ఎసిపి లక్ష్మీనారాయణ, నియోజకవర్గంలోని ఆయా పోలీస్ స్టేషన్ల సిఐల హాజరు**

**మన దునియా,రంగారెడ్డి జిల్లా షాద్ నగర్:మార్చి 07**

మార్చి 28న రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ కోర్టు సముదాయంలో జరిగే జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని బాధ్యత విధంగా నిర్వహించాలని 16వ అదనపు జిల్లా న్యాయమూర్తి ఎస్ స్వాతి రెడ్డి అధికారులకు సూచించారు. శనివారం కోర్టులో ఏర్పాటు చేసిన లోక్ అదాలత్ సన్నాహక సమావేశంలో జిల్లా అదనపు జడ్జ్ ఎస్ స్వాతి రెడ్డి తో పాటు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జ్ కొత్త రవి, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి ఎం సాహితీ, షాద్ నగర్ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ లక్ష్మీనారాయణ, పట్టణ సీఐ సీతారాం, నందిగామ సిఐ ప్రసాద్, కొత్తూరు సిఐ నరసయ్య, కేశంపేట నరహరి, చౌదరి గూడ ఎస్సై విజయ్ కుమార్, కొందుర్గు ఎస్సై వెంకటేష్ అదేవిధంగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ సబియా సుల్తాన తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి ఎస్ స్వాతి రెడ్డి పోలీసులు బ్యాంకు అధికారులతో మాట్లాడారు. ఘర్షణలు వ్యక్తిగత దూషణలు బ్యాంకులకు సంబంధించిన చెక్ బౌన్స్ కేసులు తదితర కేసులకు సంబంధించి పరిష్కరించుకునేందుకు జాతీయ లోక్ అదాలత్ ఎంత ఉపయోగపడుతుందని ఈ అదాలత్ ద్వారా కక్షిదారులను రాజీపరిచి కేసులను తీసి వేసుకునేందుకు మంచి అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. సాధ్యమైనంతవరకు ఎక్కువ స్థాయిలో కేసులను రాజీపరచుకునే విధంగా పోలీసు శాఖ అదేవిధంగా బ్యాంకుల యాజమాన్యం కృషి చేయాలని న్యాయమూర్తి సూచించారు. ఈ సందర్భంగా ఇటీవల షాద్ నగర్ పట్టణ సిఐగా బాధ్యతలు చేపట్టిన సీతారాం జిల్లా అదనపు జడ్జి ఎస్ స్వాతి రెడ్డిని మర్యాదపూర్వకంగా కలుసుకొని ఆమెకు పూల మొక్కను బహుకరించారు..

# కాలేశ్వరం నీళ్లతో ఊరి చెరువు నింపాలని రైతుల ధర్నా

**మన దునియా,పుల్లూరి:మార్చి 07**




సిద్దిపేట రూరల్ మండలం పుల్లూరి గ్రామంలో కాలేశ్వరం నీటితో గ్రామ చెరువుల నింపాలని రైతులు ధర్నా కార్యక్రమం చేపట్టారు ఈ కార్యక్రమంలో రైతులు రోడ్డుపై బైఠాయించి తమ పంటలు ఎండిపోతున్నాయని తమపై దయవుంచి కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామ చెరువులోకి నీటి విడుదల చేసి తమ పంటలను కాపాడాలని లేనిపక్షంలో ధర్నాను ఉధృతం చేసి కలెక్టరేట్ ముందు ధర్నా చేస్తామని తెలిపారు  తలాపునే గోదారి మా గ్రామ పంట పొలాలు ఎడారి అనే నినాదంతో  రైతులు ప్రభుత్వానికి విన్నవించారు.సిద్దిపేట దగ్గరలోని రంగనాయక సాగర్ ఎడమ కాలువ పుల్లూరు గ్రామం నుండి దాదాపు తొమ్మిది కిలోమీటర్లు ప్రయాణిస్తుంది ఈ కాలువ కోసం కొన్ని వందల ఎకరాలు రైతులు తమ పంట పొలాలను వదులుకొని ప్రభుత్వం ఎంత ఇస్తే అంత పరిహారం తీసుకొని మన పంట పొలాలు పోయిన మిగతా వాళ్ళందరి పొలాలు సస్యశ్యామలం అవుతాయని గ్రామ చెరువులు నిండి ప్రజలు సంతోషిస్తారని మా భూములు వదులుకుంటే మా పుల్లూరు గ్రామం పై ప్రభుత్వం శీతకన్ను వేసిందని మా గ్రామ చెరువులోకి చుక్కనీరు కూడా రాకుండా పోయిందని తద్వారా కాలువల్లో జాగా పోయిన  పొలాల రైతులు బాధపడుతున్నారు ఈ విషయమై మా గ్రామ చెరువు నింపడం కోసమే ఇరిగేషన్ ఏఈకి డి ఈ కి జిల్లా కలెక్టర్ గారికి స్థానిక ఎమ్మార్వో గారికి ఎన్నో వినతి పత్రాలు అందించిన ఎలాంటి ప్రయోజనం లేదని రాజకీయ నాయకులకు అధికారులకు విన్నవించిన ఎలాంటి స్పందన లేదు కాబట్టే పార్టీలకతీతంగా రైతులందరూ ఏకమై ధర్నా కార్యక్రమం చేపట్టామని తమ గూడు విని ఇప్పటికైనా ప్రభుత్వం మల్లన్న సాగర్ కాల్వ ద్వారా  త్రీ ఆర్ కాలువ ఇరుకోడు చిన్న గుండెవెల్లి పుల్లూరు రామంచ వరకు కాల్వ సాంక్షన్ అయి ఉంది కాబట్టి ఆ కాలువను త్వరగా పూర్తిచేసి మా రైతులను ఆదుకోవాలని గత్యంతరం లేని పరిస్థితుల్లోనే ధర్నా చేయడం జరుగుతుందని తెలిపారు ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి మా రైతుల ని ఆదుకోవాలని విన్నవించారు

# ధర్మసాగర్ జెడ్పీహెచ్ఎస్ బాయ్స్ పాఠశాలలో ఘనంగా వార్షికోత్సవం....






**మన దునియా,ధర్మసాగర్:మార్చి 07**

ధర్మసాగర్ గ్రామంలోని జెడ్పీహెచ్ఎస్ బాయ్స్ పాఠశాల వార్షికోత్సవం పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.బి. ధర్మ ప్రకాష్  అధ్యక్షతన ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ధర్మసాగర్ గ్రామ సర్పంచ్ మాచర్ల జ్యోతి ఎలియా ముఖ్య అతిథిగా హాజరై పాఠశాల విద్యార్థులు రూపొందించిన "ది యంగ్ మైండ్స్" పాఠశాల మ్యాగజైన్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో భాగంగా పాఠశాల విద్యార్థులు వివిధ సామాజిక అంశాలపై ఆధారితమైన నృత్యాలు ప్రదర్శించి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. ఈ నృత్యాలను ఉపాధ్యాయులు కవితాదేవి మరియు రాజమ్మ శిక్షణ ఇచ్చారు. పాఠశాలలో నిర్వహించిన వివిధ క్రీడా పోటీలలో విజేతలైన విద్యార్థులకు ముఖ్య అతిథి మాచర్ల జ్యోతి ఎలియా మరియు వార్డ్ సభ్యులు చిలుక ప్రథిభ, మల్కి రెడ్డి మమత, బెల్లం ప్రేమ్ కుమార్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ క్రీడా బహుమతి ప్రదాన కార్యక్రమాన్ని ఉపాధ్యాయులు కిరణ్మయి, రామకృష్ణ, ప్రసన్న సమర్థవంతంగా నిర్వహించారు. కార్యక్రమానికి అవసరమైన ఏర్పాట్లు సీనియర్ ఉపాధ్యాయులు సురేష్ మరియు సుధీర్ రెడ్డి పర్యవేక్షణలో సక్రమంగా జరిగాయి. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మరియు అతిథులు విద్యార్థులు వివిధ కార్యక్రమాలలో చూపిన ప్రతిభను ప్రశంసిస్తూ, పాఠశాల అభివృద్ధికి తమ పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. అంతేకాక అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా పాఠశాలలో పనిచేస్తున్న మహిళా ఉపాధ్యాయులను పురుష ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు మరియు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# హైదరాబాద్‌లోని అనురాగ్ విశ్వవిద్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం

**మన దునియా,హైదరాబాద్ మార్చి 07**

న ఈ-బ్లాక్ ఆడిటోరియంలో ఎంతో ఉత్సాహంగా మరియు ప్రేరణాత్మకంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం సమాజంలో మహిళల శక్తి, సాధనలు మరియు సామర్థ్యాన్ని ప్రతిబింబించే విధంగా జరిగింది. మహిళలు తమ ప్రతిభను గుర్తించి, తమ హక్కుల కోసం మాట్లాడేందుకు మరియు వివిధ రంగాల్లో నాయకత్వ పాత్రలు స్వీకరించేందుకు ప్రోత్సహించడమే ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశ్యం. ఈ సందర్భంగా అధ్యాపకులు, విద్యార్థులు మరియు గౌరవ అతిథులు పాల్గొని మహిళల కృషి మరియు సాధనలను స్మరించారు.కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సంగీత పారిసబోయినా, ఎఫ్‌టీసీసీఐ డైరెక్టర్, సభను ఉద్దేశించి ప్రేరణాత్మక ప్రసంగం చేశారు. మహిళలు అవసరమైనప్పుడు తమ హక్కుల కోసం ధైర్యంగా నిలబడాలని ఆమె ప్రోత్సహించారు. సానుకూల ఆలోచన విధానాన్ని అలవరుచుకోవడం మరియు పాజిటివ్ అఫర్మేషన్లను పాటించడం ద్వారా ఆత్మవిశ్వాసం మరియు స్వీయనమ్మకం పెరుగుతుందని ఆమె తెలిపారు. మహిళలకు జీవితాన్ని ప్రసాదించే మరియు పెంచిపోషించే అపూర్వమైన శక్తి ఉందని కూడా ఆమె పేర్కొన్నారు.అలాగే ఉద్యోగ ప్రదేశాల్లో మహిళల భద్రత మరియు గౌరవం ఎంతో ముఖ్యమని ఆమె వివరించారు. పని ప్రదేశాల్లో ఎటువంటి అసురక్షిత పరిస్థితులు లేదా అన్యాయం ఎదురైనప్పుడు మహిళలు ధైర్యంగా మాట్లాడాలని ఆమె సూచించారు. అదే సమయంలో అవకాశవాదులుగా కాకుండా నిజాయితీగా మరియు కష్టపడి పనిచేయాలని, తమ బాధ్యతలను నిబద్ధతతో నిర్వర్తించాలని ఆమె మహిళలకు సూచించారు.అనురాగ్ విశ్వవిద్యాలయం ఉపకులపతి అర్చనా మంత్రిది సభను ఉద్దేశించి మహిళా సాధికారతపై ప్రేరణాత్మక సందేశాన్ని అందించారు. మహిళలు తమ జీవితంలో ఎదురయ్యే ప్రతి అడ్డంకిని ధైర్యంగా ఎదుర్కొని అధిగమించేందుకు సిద్ధంగా ఉండాలని ఆమె అన్నారు. తమ సమస్యలు మరియు సవాళ్లను మనసులో దాచుకోకుండా స్వేచ్ఛగా మాట్లాడాలని కూడా ఆమె ప్రోత్సహించారు.డా. అర్చనా మంత్రిది ప్రకారం మహిళలే గొప్ప శక్తి మూలం మరియు వారు తమలోని ఆ అంతర్గత శక్తిని




గుర్తించుకోవాలి. ప్రతి మహిళ సహజంగానే ఒక మల్టీటాస్కర్ అని, జీవితంలో ఎన్నో బాధ్యతలను సమర్థంగా నిర్వహించగల సామర్థ్యం వారికి ఉందని ఆమె పేర్కొన్నారు. సమాజంలోని అన్ని రంగాల్లో మహిళలు బలమైన నాయకులుగా ఎదగగల సామర్థ్యం కలిగి ఉన్నారని, వారు ధైర్యంగా నాయకత్వ పాత్రలను స్వీకరించాలని ఆమె సూచించారు.ఈ కార్యక్రమం కుటుంబాలు, సమాజం మరియు సంస్థలను నిర్మించడంలో మహిళల కీలక పాత్రను గుర్తు చేసింది. గౌరవ అతిథులు చేసిన ప్రసంగాలు మహిళల శక్తిని గుర్తించి, లింగ సమానత్వాన్ని ప్రోత్సహిస్తూ, మహిళలు నాయకత్వ స్థానాల్లోకి రావాలని అందరినీ ప్రేరేపించాయి. కార్యక్రమం చివరగా మహిళా సంక్షేమ కమిటీ కన్వీనర్ డా. సిరీష ధన్యవాద ప్రసంగం చేశారు. ముఖ్య అతిథి సంగీత పారిసబోయినా, ఉపకులపతి అర్చనా మంత్రిది, అసోసియేట్ డీన్ డా. శ్రీనివాస చలపతి, అన్ని విభాగాధిపతులు, అధ్యాపకులు మరియు విద్యార్థులకు ఆమె హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు కృషి చేసిన నిర్వాహక బృందం ప్రయత్నాలను కూడా ఆమె అభినందించారు.

# కొమ్మాల జాతరలో బెల్ట్ షాపుల దందా


**దేవాలయం పక్కనే మద్యం అమ్మకాలు ఎవరి అనుమతి?**


**తప్ప తాగి మందుబాబుల హల్చల్**

**జాతరలో ఇబ్బంది పడుతున్న భక్తులు**

**మన దునియా వరంగల్ జిల్లా గీసుగొండ:మార్చి 07**

ప్రసిద్ధ కొమ్మాల శ్రీ లక్ష్మీనరసింహస్వామి జాతరలో దేవస్థానం పరిసరాల్లో బెల్ట్ షాపుల ద్వారా విచ్చలవిడిగా మద్యం విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. మద్యం దందా సంచలనం సృష్టిస్తున్నాయి. జాతరకు వేలాది మంది భక్తులు తరలివస్తున్న వేళ దేవాలయం సమీపంలోనే మద్యం అమ్మకాలు జరుగుతుండటం భక్తుల్లో తీవ్ర ఆగ్రహం రేకెత్తిస్తోంది. స్థానికుల సమాచారం ప్రకారం జాతర సమయంలో కొందరు వ్యక్తులు తాత్కాలికంగా బెల్ట్ షాపులు ఏర్పాటు చేసి అధిక ధరలకు మద్యం విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. పవిత్రమైన దేవాలయం పరిసరాల్లో ఈ అక్రమ వ్యవహారం



జరుగుతుండటంపై భక్తులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. తెలంగాణ మద్యం నిషేధ మరియు ఎక్సైజ్ చట్టం1968 ప్రకారం లైసెన్స్ లేకుండా మద్యం విక్రయించడం నేరం. ముఖ్యంగా దేవాలయాలు, పాఠశాలలు వంటి ప్రజా ప్రదేశాల సమీపంలో అనధికారంగా మద్యం విక్రయిస్తే సెక్షన్ 34 కింద కేసులు నమోదు చేసే అవకాశం ఉంది. అయినప్పటికీ జాతర సమయంలో కొన్ని చోట్ల బెల్ట్ షాపులు నడుస్తున్నాయన్న సమాచారం అధికారుల దృష్టికి చేరిందా? లేదా అధికారుల కను సన్నల్లోనే ఈ బెల్ట్ షాపుల దందా నడుస్తుందా అనేది పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. జాతర పవిత్రకు అపవిత్ర తోడైంది లక్ష్మీనరసింహస్వామి జాతర అంటే ఎంతో పవిత్రతతో కూడినటువంటి ఎలాంటి మాంసాహారము మద్యపానము లేకుండా జరగాల్సిన జాతరడ గుడి చుట్టూ బెల్టు షాపులు ఏర్పాటు చేసిడ దేవాలయాన్ని అపవిత్రం చేస్తున్నారు.. తెలంగాణ రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి భక్తులు వేలాదిగా తరలివస్తున్నారు.. పట్టపగలే మద్యపానం సేవిస్తూ.. జాతరకు వచ్చే మహిళలను .. భక్తులను మందుబాబులు జాతరలో హల్చల్ చేస్తున్నారు.. బెల్ట్ షాపుల్లో ఒక్కో క్వార్టర్ పై ఎమ్మార్పీ రేటు అదనంగా 70 రూపాయలు, ఫుల్ బాటిల్ అయితే



సుమారు 250 రూపాయలు, ఒక్కో బీరు బాటిల్ పై వంద రూపాయలు అదనంగా విక్రయిస్తున్నారు..

**దందాలో ఎవరి వాటా ఎంత..?**

ఈ దందాలోఎవరి వాటా ఎంతని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.ఎక్సైజ్, పోలీసులు ఏం చేస్తున్నారు అనధికారికంగా విక్రయించేందుకు పర్మిషన్ ఎవరిచ్చారని భక్తులు ప్రశ్నిస్తున్నారు.. అక్రమ మద్యం అమ్మకాలపై ఎక్సైజ్ సీఐ వివరణ అక్రమ మద్యం అమ్మకాలపై ఎక్సైజ్ సీఐ తాతాజీ ని సంప్రదించగా, జాతర ప్రాంతంలో ఒకే వైన్స్ షాపుకు మాత్రమే అనుమతి ఇచ్చామన్నారు.అది కూడా జాతర ప్రారంభమైన మూడు రోజుల వరకు మాత్రమే చెల్లుబాటు అవుతుందని ఆయన తెలిపారు. దేవస్థానం పరిసరాల్లో బెల్ట్ షాపుల ద్వారా అక్రమంగా మద్యం విక్రయాలు జరుగుతున్నాయన్న సమాచారం గురించి అడగగా, "ఆ విషయాన్ని రేపు పరిశీలిస్తాను" అని సీఐ పేర్కొన్నారు. దేవస్థానం పరిసరాల్లో మద్యం విక్రయాలకు అనుమతి ఎవరు ఇచ్చారు? ఎక్సైజ్ శాఖకు ఈ విషయం తెలుసా? లేక అధికారుల కళ్లముందే అక్రమ వ్యాపారం జరుగుతుందా? అనే ప్రశ్నలు స్థానికంగా చర్చనీయాంశంగా మారాయి. ఈ వ్యవహారంపై ఎక్సైజ్ శాఖ అధికారులు, స్థానిక పోలీసులు వెంటనే స్పందించి బెల్ట్ షాపులపై కఠిన చర్యలు తీసుకోవాలని భక్తులు, గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు. జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా, దేవాలయ పవిత్రతను కాపాడేలా అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు

## 2025 సం.గద్దర్ తెలంగాణ ఫిల్మ్ అవార్డ్స్ సొంతం చేసుకున్న వేణు ఊడుగుల & టీం కు అభినందనలు

**మన దునియా,వరంగల్ జిల్లా, చెన్నారావుపేట,ఉప్పరపల్లి: మార్చి 07**



2025 సంవత్సరానికి గాను తెలంగాణ ప్రభుత్వం బిగద్దర్ తెలంగాణ ఫిలి అవార్డ్స్ ప్రకటించగా వరంగల్ జిల్లా, చెన్నారావుపేట మండలం, ఉప్పరపల్లి గ్రామ వాస్తవ్యులు వేణు ఊడుగుల నిర్మించిన చిత్రం "రాజు వెడ్స్ రాంభాయి" కి ఉత్తమ చిత్రం అవార్డుతో పాటు ఉత్తమ డైరెక్టర్ గా సాయిలు కంపాటి, ఉత్తమ నేపథ్య గాయకుడి గా అనురాగ్ ,ఉత్తమ మేల్ యాక్టర్ గా చైతు జొన్నల గడ్డ లకు అవార్డ్స్ రావడం సంతోషకరమైన విషయం అని,ఈ సందర్భంగా ఉప్పరపల్లి ఉద్యోగ వ్యాపార వ్యవసాయదారుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు,బెస్ట్ ఫ్రెండ్స్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు పులి దేవేందర్ ముదిరాజ్ వేణు ఊడుగుల & టీమ్ కు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పులి దేవేందర్ ముదిరాజ్ మాట్లాడుతూ అచ్చమైన తెలంగాణ గ్రామీణ నేపథ్యం గల సినిమాలకు ఆదరణ పెరుగుతున్నందుకు సంతోషం అని, వేణు ఊడుగుల కిందిస్థాయి ఎన్నో కష్టాలు పడి ఈ స్థాయికి చేరుకున్నారని, కష్టం విలువ తెలిసిన వ్యక్తిగా సినీ రంగంలో తనలాంటి వాళ్ళని ఎందరినో ప్రోత్సహిస్తున్నారని,ఆ కోవలోకే రాజు వెడ్స్ రాంబాయి డైరెక్టర్ సాయిలు కాంపాటి వస్తారని, ఇంకా సినీ పరిశ్రమలో తనలాంటి ఔత్సాహికులను ప్రోత్సహిస్తున్నారని,సామాజిక విలువలతో సినిమాలు తీస్తున్న వేణు ఊడుగుల కు ఉప్పరపల్లి గ్రామస్తులు, మిత్రులు అభిమానులు, బంధువులు,సహచర మిత్రులు ప్రత్యక్షంగా పరోక్షంగా అభినందనలు తెలియజేస్తున్నారని, భవిష్యత్తులో వేణు ఊడుగుల నిర్మాతగా, డైరెక్టర్ గా మరిన్ని ఉత్తమమైన సినిమాలు తీసి ఇంకా ఉన్నత స్థానానికి ఎదగాలని ఆశిస్తున్నామని అన్నారు.

## వరంగల్‌కు 5257.20 కోట్లు మంజూరు

**అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ పథకానికి పరిపాలనా అనుమతి**

**జీడబ్ల్యూఎంసీ పరిధిలో పనులకు ఊతం**


**అర్బన్ చాలెంజ్ ఫండ్ ద్వారా నిధుల సమీకరణ**

**విదేశీ సహాయం, కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో కలిపి కేటాయింపులు**

**నగర పారిశుధ్యానికి కీలక మౌలిక సదుపాయం**

**మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ శాఖ ఉత్తర్వులు జారీ**

**మన దునియా,వరంగల్: మార్చి 07**


GOVERNMENT OF TELANGANA
ABSTRACT

Municipal Administration Department – Engineering – Greater Warangal Municipal Corporation, Warangal – Administrative Sanction for an amount of Rs.5257.20 crores for works of Comprehensive Under Ground Drainage Scheme in GWMC, Warangal Phase-I – Orders – Issued.

MUNICIPAL ADMINISTRATION (UBS) DEPARTMENT

G.O.Rt.No.322 Dated: 07.03.2026

Read the following:

1. G.O.Rt.No.573, MA & UD (Engg.2) Department, dated 17.11.2024.
2. From C&DMA, Hyderabad Lr.No.803791/2025/M1, dated 16.12.2025 and dated 07.0[illegible]

ORDER:

In the [illegible] t have accorded administrative sanction "In principle approval" for an amount of Rs.4170 Crores for taking up Comprehensive Under Ground Drainage (UGD) scheme in Greater Warangal Municipal Corporation (GWMC), Warangal.

2. In the reference 2nd read above, the Commissioner and Director of Municipal Administration, Hyderabad has informed that, after estimation, the scheme would be the cost of Rs.5257.20 Crores. However, while according administrative sanction specific financial tie-up was not indicated in the said administrative sanction. As such there is no progress in the announcement made by Hon'ble Chief Minister then. In order to tie-up the finance, the C&DMA, Municipal Administration Department has explored the opportunity of availing the scheme announced by Government of India in 2025-26 Union Budget called the Urban Challenge Fund. The funding pattern under Urban Challenge Fund is Government of India grant of 25% of the Project Outlay provided 50% is tied up with a Bank Loan or PPP and State / ULB will cover 25%. Ministry of Housing and Urban Affairs, Government of India facilitated Conferences and Study tours with External Aid partners such as ADB, EU, WB, KfW etc. KfW evinced interest in UGD for GWMC. After a series of interactions and field visits, KfW got its Mission to visit Warangal and had meetings with the C&DMA and Secretary to Government, Municipal Administration Department.

3. The Commissioner and Director of Municipal Administration, Hyderabad has informed that the Senior Sector Specialist Sustainable Urban Development, KfW Office, New Delhi, German Development Corporation has expressed its willingness to support the external funding for the said GWMC project under the Urban Challenge Fund guidelines. The KfW team has been appraised of the DPR prepared for GWMC, UGD project with project cost of Rs.5257.20 crores, and the KfW given their consent in principle for the same and requested the state to upload the Preliminary Project Report (PPR) in Department of Economic Affairs portal, for further process of the same.

4. The Commissioner and Director of Municipal Administration, Hyderabad has therefore requested the Government to accord administrative sanction for an amount of Rs.5257.20 crores for taking up the works Comprehensive Under Ground Scheme in GWMC, Warangal Phase-I, with the following funding structure for the GWMC UGD Project.

- 50% External Assistance (Loan)
- 25% Government of India support under UCF, and
- 25% State Government share

P.T.O.

గ్రేటర్ వరంగల్ నగరంలో సమగ్ర అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ వ్యవస్థ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ పథకానికి మొత్తం 5257.20 కోట్ల వ్యయంతో పరిపాలనా అనుమతి మంజూరు చేస్తూ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. వరంగల్ నగరంలో ఆధునిక మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ఈ ప్రాజెక్టును అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఫేజ్-1 కింద ఈ అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ పథకం చేపట్టనున్నారు. మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ శాఖ జారీ చేసిన జీవో ఆర్.టి నెంబర్ 322 ప్రకారం ఈ పనులకు 5257.20 కోట్ల వ్యయాన్ని ప్రభుత్వం ఆమోదించింది. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులు శనివారం జారీ అయ్యాయి. ఈ ప్రాజెక్టు ద్వారా నగరంలో మురుగు నీటి నిర్వహణను పూర్తిగా శాస్త్రీయంగా నిర్వహించడానికి అవకాశం కలుగుతుంది. ప్రస్తుతం నగరంలో పెరుగుతున్న జనాభా, విస్తరిస్తున్న పట్టణ పరిమితులను దృష్టిలో పెట్టుకుని సమగ్ర డ్రైనేజ్ వ్యవస్థ అవసరం ఉందని అధికారులు పేర్కొన్నారు.

**నిధుల సమీకరణ ఇలా**

ఈ భారీ ప్రాజెక్టుకు అవసరమైన నిధులను మూడు వనరుల నుంచి సమీకరించనున్నారు. మొత్తం వ్యయంలో 50 శాతం విదేశీ ఆర్థిక సహాయం రూపంలో రుణంగా పొందనున్నారు. మరో 25 శాతం కేంద్ర ప్రభుత్వం అర్బన్ చాలెంజ్ ఫండ్ ద్వారా అందించనుంది. మిగతా 25 శాతం రాష్ట్ర ప్రభుత్వం వాటాగా భరించనుంది. జర్మనీకి చెందిన కెఎఫ్‌డబ్ల్యూ అభివృద్ధి సంస్థ ఈ ప్రాజెక్టుకు ఆర్థిక సహాయం అందించేందుకు ఆసక్తి చూపినట్లు అధికారికంగా వెల్లడైంది. ఈ సంస్థ ప్రతినిధులు వరంగల్ నగరాన్ని సందర్శించి ప్రాజెక్టు వివరాలను పరిశీలించినట్లు అధికారులు తెలిపారు. గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కోసం తయారు చేసిన డీటెయిల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్‌ను కూడా సంబంధిత సంస్థలకు అందజేసినట్లు సమాచారం. ప్రాజెక్టు అమలుకు సంబంధించి ముందస్తు అనుమతి కూడా పొందినట్లు అధికారులు పేర్కొన్నారు.

**నగరాభివృద్ధికి కీలక అడుగు**

ఈ అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ ప్రాజెక్టు అమలుతో వరంగల్ నగరంలో పారిశుధ్య పరిస్థితులు మెరుగుపడతాయని అధికారులు భావిస్తున్నారు. మురుగు నీటి సమస్యలు తగ్గడంతో పాటు ప్రజారోగ్యానికి కూడా ఇది ఉపయోగపడనుంది. నగరంలో వర్షాకాలంలో తరచుగా ఎదురయ్యే మురుగు నీటి సమస్యలకు ఈ ప్రాజెక్టు దీర్ఘకాలిక పరిష్కారం చూపుతుందని అధికారులు తెలిపారు. నగరాభివృద్ధికి ఇది ఒక కీలక అడుగుగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ ఉత్తర్వులను రాష్ట్ర గవర్నర్ పేరుతో ప్రభుత్వం జారీ చేసింది. మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ శాఖ కార్యదర్శి డాక్టర్ టి.కె. శ్రీదేవి ఈ ఉత్తర్వులపై సంతకం చేశారు. ప్రాజెక్టు అమలు కోసం అవసరమైన చర్యలను తీసుకోవాలని మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కమిషనర్ మరియు డైరెక్టర్‌కు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. త్వరలోనే ఈ ప్రాజెక్టు పనులు ప్రారంభం కానున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి.

మన దునియా
మన అక్షరం - మన ప్రపంచం


# ఈ నీరు అమృతంతో సమానం!

ప్రస్తుత కాలంలో మారుతున్న ఆహారపు అలవాట్లు, మారుతున్న జీవనశైలి వల్ల శరీరంలో అనేక మార్పులు చోటు చేసుకుంటున్నాయి. వాటిలో ముఖ్యంతో వయసుతో సంబంధం లేకుండా వచ్చే స్థూలకాయం ఒకటి. ఊబకాయాన్ని తగ్గించుకోవడానికి మంచి ఆహారం, వ్యాయామమే మార్గం. అంతేకాకుండా కొన్ని ఇంటి చిట్కాలను పాటించడం వల్ల బరువు తగ్గొచ్చని మన పెద్దలు చెబుతున్నారు. బరువు తగ్గడానికి, ఉదయాన్నే ఖాళీ కడుపుతో ఈ నీటిని తాగితే.. నిమ్మ, తేనె: ఒక గ్లాసు నీటిలో సగం నిమ్మకాయ, ఒక చెంచా తేనె, చిటికెడు ఎండుమిర్చి వేసి తినాలి. నల్ల మిరియాలలో పైపెరిన్ అనే మూలకం ఉంటుంది. ఇది శరీరంలో కొత్త కొవ్వు కణాలు పేరుకుపోవడానికి అనుమతించదు. నిమ్మకాయలో ఉండే ఆస్కార్బిక్ యాసిడ్ శరీరంలోని కొలెస్ట్రాల్‌ను తగ్గిస్తుంది. శరీరం నుండి విషపూరిత మూలకాలను తొలగించడంలో సహాయపడుతుంది. సోంపు నీరు: 6-8 సోంపు గింజలను ఒక కప్పు నీటిలో ఐదు నిమిషాలు మరిగించాలి. దీన్ని వడపోసి ఉదయం ఖాళీ కడుపుతో వేడి వేడిగా తాగాలి. ఇది అధిక ఆకలి సమస్య నుండి ఉపశమనం కలిగిస్తుంది. అంతేకాకుండా తినాలనే కోరికను తగ్గిస్తుంది. ఇది శరీరంలోని మురికిని శుభ్రపరుస్తుంది. మూత్రవిసర్జన, చెమట అధికంగా వచ్చేలా ప్రేరేపిస్తుంది. జీలకర్ర నీరు: జీలకర్ర నీటిని తాగడం వల్ల స్థూలకాయం త్వరగా తగ్గుతుంది. ఇందులో క్యుమినాల్డిహైడ్, థైమోక్వినోన్ వంటి సమ్మేళనాలు ఉన్నాయి. ఇవి యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాలను కలిగి ఉంటాయి. ఆర్థరైటిస్ , కీళ్ల నొప్పులు వంటి పరిస్థితులు ఉంటే, చికాకు, వాపును తగ్గించడంలో జీలకర్ర నీరు ప్రభావవంతంగా ఉంటుంది. మెంతి గింజల నీరు: మెంతి నీరు తాగడం వల్ల స్థూలకాయం తగ్గడమే కాకుండా మధుమేహాన్ని అదుపులో ఉంచుతుంది. రక్తంలో గ్లూకోజ్ స్థాయిని సమతుల్యంగా ఉంచడంలో మెంతులు సహకరిస్తాయి. మెంతి నీటిని తయారు చేయడానికి, ముందుగా 1 టీస్పూన్ మెంతి గింజలను 1 గ్లాసు నీటిలో రాత్రంతా నానబెట్టండి. దీని తరువాత, ఉదయం నిద్రలేచిన తర్వాత, ఈ నీటిని వడపోసి ఖాళీ కడుపుతో తాగాలి.



## గుండెపోటుకు గురికాకూడదనుకునే వారు వీటిని అలవాటు చేసుకోవాల్సిందే

ప్రస్తుత రోజుల్లో గుండెపోటు అనేది సర్వసాధారణమైపోయింది. ఇంతకుముందు ఈ సమస్య పెద్దవారిలో మాత్రమే కనిపించేది. కానీ, ఇప్పుడు యువత కూడా దీని బారిన పడుతున్నారు. ఎవరైనా డ్యాన్స్ చేస్తున్నప్పుడు, లేదా ఏదైనా పనిచేస్తున్నప్పుడు, మాట్లాడుతున్నప్పుడు ఎవరైనా పడిపోయారని మీరు తరచుగా వినే ఉంటారు. అలాంటి వారు కార్డియాక్ అరెస్ట్ కారణంగా మరణిస్తారు. వీటన్నింటికీ ప్రధాన కారణం ధమనులలో ఫలకం అడ్డుపడటం. దీని కారణంగా రక్తం గుండెకు చేరదు. శరీరంలో ఆక్సిజన్ కొరత ఉంటుంది. ఈ పరిస్థితిలో గుండెపోటు లేదా గుండె ఆగిపోయే ప్రమాదం పెరుగుతుంది. ఈ పరిస్థితులన్నింటినీ నివారించడానికి, మీ జీవనశైలిలో కొన్ని మార్పులు అవసరం. అందుకోసం ఈ అలవాట్లను అలవాటు చేసుకోండి. కొలెస్ట్రాల్ లేదా ఫలకం ధమనులను అడ్డుకోవడం వల్ల గుండెపోటు లేదా కార్డియాక్ అరెస్ట్ సంభవిస్తుంది. కొలెస్ట్రాల్ పెరగడానికి అతి పెద్ద కారణం అనారోగ్యకరమైన ఆహారం. ఈ పరిస్థితిలో, మీరు గుండె సంబంధిత సమస్యలను నివారించాలనుకుంటే ఈ రోజు నుండి అనారోగ్యకరమైన ఆహారం లేదా ప్రాసెస్ చేసిన, ప్యాక్ చేసిన ఆహారాన్ని తినడం మానేయండి. వాటికి బదులుగా పచ్చి ఆకు కూరలు, పప్పులు, తృణధాన్యాలు, తాజా పండ్లు, గుడ్లు వంటి తాజా ఇంట్లో తయారు చేసిన ఆహారాన్ని తినండి. ధమనులలో ఫలకం పేరుకుపోకుండా నిరోధించడానికి, మీరు రోజూ వ్యాయామం చేయడం ముఖ్యం. ప్రతిరోజూ కనీసం అరగంట పాటు వ్యాయామం చేయాలి. దీని కోసం ప్రతిరోజూ సైకిల్, ఈత, పరుగు, నడక, శక్తి శిక్షణ చేయండి. ధూమపానం ఊపిరితిత్తులకు మాత్రమే హాని చేస్తుందని అనుకుంటే అది తప్పు. అది గుండెకు కూడా హాని చేస్తుంది. సిగరెట్ పొగ నుండి విడుదలయ్యే రసాయనాలు ధమనులలో పొరను ఏర్పరుస్తాయి. దీని వలన ధమనులు నిరోధించబడతాయి. ఈ రోజుల్లో, ఒత్తిడి అనేది ప్రతి ఒక్కరి జీవితంలో ఒక భాగంగా మారుతోంది. ఇది ధమనులలో వాపును కలిగిస్తుంది. దీని వలన ధమనులు ఉబ్బడం అలాగే నిరోధించబడతాయి. ఒత్తిడి కారణంగా శరీరంలో 1500 రసాయనాలు విడుదలవుతాయని తెలిస్తే మీరు ఆశ్చర్యపోతారు. ఈ పరిస్థితిలో, ఒత్తిడిని నియంత్రించడానికి ప్రశాంతంగా ఉండండి. కోపం తెచ్చుకోకండి. ప్రతిరోజూ యోగా, ప్రాణాయామం, ధ్యానం చేయండి. మీరు మీ హృదయాన్ని ప్రేమిస్తే మద్యానికి దూరంగా ఉండండి. ఆల్కహాల్ కొలెస్ట్రాల్, రక్తపోటు రెండింటినీ పెంచుతుంది. కాబట్టి, గుండె ఆరోగ్యంగా ఉండటానికి దాని వినియోగాన్ని నివారించండి. మీ బరువును అదుపులో ఉంచుకోండి. అధిక బరువు కొలెస్ట్రాల్, అధిక రక్తం, అధిక షుగర్‌కి అతి పెద్ద కారణంగా పరిగణించబడుతుంది. కాబట్టి దానిని అదుపులో ఉంచండి. దీని కోసం, క్రమం తప్పకుండా వ్యాయామం చేయండి. అలాగే ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోండి.




## అలాంటివారు ఈ పండు తినకండి!




జామ పండు.. పేదల ఆపిల్ గా పేరు దక్కించుకున్న జామ పండు అన్ని సీజన్లో విరివిగా లభిస్తుంది. దానిమ్మ పండ్లతో పోల్చుకుంటే ఖర్చు కూడా చాలా తక్కువ. చిన్న పెద్ద అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరు కూడా జామ పండును ఎంతో ఇష్టంగా తింటారు. జామపండు పోషకాలకు నిలయం అని చెప్పవచ్చు. ఇకపోతే జామ పండు తినడం వల్ల శరీరానికి ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు కూడా లభిస్తాయి.. అయితే కొంతమందికి జామపండు పడదు. కొంతమందికి సైడ్ ఎఫెక్ట్స్ కూడా వస్తాయి. ఇంకొంతమంది ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటారు. ఇకపోతే ఎలాంటి ఆరోగ్య సమస్యలు ఉన్నవారు జామ పండు తినకూడదో ఇప్పుడు చూద్దాం. జామ పండు చలికాలంలో తింటే బోలెడు ప్రయోజనాలు కలుగుతాయి. ఇందులో ఉండే విటమిన్ సి ఇమ్యూనిటీ పవర్ ను పెంచుతుంది. జామ పండు తినడం వల్ల రక్తపోటు తగ్గడంతో పాటు గుండె ఆరోగ్యం కూడా మెరుగుపడుతుంది. జామ పండులో ఉండే విటమిన్ ఏ కంటి ఆరోగ్యాన్ని పెంచుతుంది. అలాగే శరీరానికి కావలసిన విటమిన్ డి కూడా లభిస్తుంది. ఇన్ని పోషకాలు ఉన్న జామ పండు కి కొంత మంది దూరంగా ఉండాలి. అలర్జీ సమస్యలతో బాధపడేవారు జామపండు తినకపోవడం మంచిది. అలాగే చర్మవ్యాధులు, శ్వాసకోశ వ్యాధులతో బాధ పడే వారు కూడా జామపండు తినకూడదు. జామ పండు తింటే చర్మం పై దద్దుర్లు, మంట, వాపు వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుంది. ఇలాంటి సమస్యలు ఉన్నవారు జామపండుకు దూరంగా ఉండటమే మేలు అని నిపుణులు చెబుతున్నారు. అలాగే గ్యాస్ట్రిక్, ఎసిడిటీ వంటి సమస్యలు ఉన్నవారు కూడా జామ పండుకు దూరంగా ఉండాలి. జామ పండు జీర్ణం అవ్వడానికి ఎక్కువ సమయం పడుతుంది కాబట్టి జీర్ణ సంబంధిత సమస్యలు ఉన్నవారు కూడా జామ పండుకు దూరంగా ఉండటమే మంచిది.

## పడుకునే ముందు వాము నీటిని తాగితే ఇన్ని లాభాలా?

వామును మెత్తటి పౌడర్‌గా చేసుకుని నిల్వ చేసుకోవాలి. పంటి నొప్పితో ఇబ్బంది పడుతున్నవారు.. అర టీ స్పూన్ వాము పౌడర్, కొద్దిగా ఆలివ్ ఆయిల్, గోరువెచ్చని నీటితో కలిపి తాగితే, పంటి నొప్పిని తగ్గిస్తుంది. అంతేకాదు..నోటి దుర్వాసన కూడా దూరమవుతుంది. గోరువెచ్చని నీటిలో వాము పౌడర్ కలిపి తాగడం వల్ల నెలసరి సమయంలో మహిళలు ఎదుర్కొనే తిమ్మిర్లు, కడుపు నొప్పిని దూరం చేస్తుంది. పొత్తి కడుపు తగ్గుతుంది. ఇలా క్రమంగా వాము వాటర్ తాగుతూ ఉంటే.. బరువు కూడా తగ్గుతారు. ఇందుకోసం వాము పొడి లేదంటే, వాముని నేరుగా కూడా తీసుకోవచ్చు. వాములో యాంటీ బాక్టీరియల్, యాంటీ ఫంగల్ లక్షణాలు పుష్కలంగా ఉంటాయి. అందువల్ల శ్వాస కోస వ్యాధులు రాకుండా ఉంటాయి. ఒక వేళ జలుబు, దగ్గు, కఫం లాంటి సమస్యలతో బాధపడుతున్న వారు ఈ నీటిని తాగడం వల్ల అవి తగ్గుముఖం పడతాయి. రాత్రి పడుకునే ముందు ఇలా గోరువెచ్చని నీటిలో వాము పౌడర్‌ని కలిపి తాగడం వల్ల జీర్ణ సమస్యలు దూరమవుతాయి. సాధారణంగా కడుపు ఉబ్బరం, త్రేన్పులు, జీర్ణ సమస్యల్ని దూరం చేయడంలో ఈ వాము వాటర్ బాగా హెల్ప్ చేస్తాయి. వాముని కప్పున్నర నీటిలో వేసి మరిగించి కప్పు అయ్యే వరకూ ఉంచాలి. దీనిని ఫిల్టర్ చేసి రెగ్యులర్‌గా తీసుకుంటే బరువు తగ్గుతారు. పిల్లలకు అరుగుదల సరిగ్గా లేకపోయినా, పెద్దలు గ్యాస్ లాంటి వాటితో బాధ పడుతున్నా వాము ఔషధంగా పనిచేస్తుంది. వాముతో జీర్ణ సంబంధిత సమస్యలను దూరం చేస్తుంది.



## నాన్‌వెజ్ వల్ల ఇన్ని సమస్యలు వస్తాయా?



ప్రతి రోజూ నాన్ వెజ్ తింటే అనేక అనారోగ్య సమస్యలు వస్తాయి అంటున్నారు నిపుణులు. ప్రతి రోజూ నాన్ వెజ్ ఐటెమ్స్ తినే వారిలో ఖచ్చితంగా కొన్ని వ్యాధులు వస్తాయట. ఆహార అలవాట్లు.. శరీర ఆరోగ్యం మీదనే కాకుండా.. మానసిక ఆరోగ్యం మీద కూడా ప్రభావం చూపిస్తుంటాయి. రోజూ ఫాస్ట్ ఫుడ్స్, లేదా మాంసం తినే వారిలో సాధారణంగా డయాబెటీస్, బీపీ, క్యాన్సర్, ఊబకాయం, కొలెస్ట్రాల్ వంటి సమస్యలు వస్తాయి. అంతేకాదు మతి మరుపు కూడా వచ్చే అవకాశం ఉందట. ప్రతిరోజూ మాంసం తినే వారిలో వయసు పెరిగే కొద్దీ మతిమరుపు వచ్చే అవకాశం ఎక్కువ ఉంటుంది. ఎలా అనుకుంటున్నారా? ఆస్ట్రేలియాలోని బాండ్ యూనివర్శిటీలో 438 మంది వ్యక్తులపై పరిశోధన చేశారు ఆరోగ్య నిపుణులు. ఆహారపు అలవాట్లు జ్ఞాపకశక్తిపై ఎలా పని చేస్తున్నాయో తెలుసుకున్నారు. ఈ అధ్యయనం 438 మంది కొనసాగితే అందులో 108 మందికి అల్జీమర్స్ వ్యాధి వచ్చినట్టు తేలిందట. దీని ప్రకారం ఎక్కువగా నాన్ వెజ్ తింటే వయసు పెరిగే కొద్దీ మతిమరుపు వస్తుంది అంటున్నారు నిపుణులు. అంటే ఇంట్లో మనుషులను కూడా గుర్తించలేని పరిస్థితి కూడా వస్తుందట. ప్రతిరోజూ మాంసం తినేవారిలో అధిక బరువు, హై కొలెస్ట్రాల్, డయాబెటీస్, బీపీ, ఫ్యాటీ లివర్, గుండె సంబంధిత సమస్యలు వచ్చే అవకాశం మరింత ఎక్కువ ఉంటుందట. ఈ సమస్యలు మాత్రమే కాదు ప్రతి రోజూ నాన్ వెజ్ తినే వారిలో నరాలకు సంబంధించిన సమస్యలు కూడా వస్తాయట. రోజూ పండ్లు, కూరలు, గింజలు తినే వారిలో నరాలకు సంబంధించిన సమస్యలు అసలు కనిపించడం లేదని పరిశోధనలో తేలిందట. మాంసాహారాలు ఎక్కువగా తీసుకుంటే నరాల సమస్యలు వస్తాయి సో స్కిప్ చేయండి. ఎక్కువగా తినకుండా లిమిట్ గా తినడం వల్ల ఈ సమస్యల నుంచి బయటపడవచ్చు. అతి సర్వత్రా వర్జయేత్. సో మితంగా తిని ఆరోగ్యంగా ఉండండని సలహా ఇస్తున్నారు నిపుణునలు.

## పెరుగు వల్ల ఇన్ని ప్రయోజనాలు ఉంటాయా?

పేగులకు మంచిది: పెరుగు లోని ప్రోబయోటిక్స్ పేగులు బాగా పనిచేయడానికి సహాయపడుతుంటాయి. కడుపు ఉబ్బరాన్ని తగ్గించే శక్తి కూడా ఈ పెరుగుకు ఉంటుంది. మానసిక ఒత్తిడి: పెరుగులోని యాంటీఆక్సిడెంట్లు, మంచి కొవ్వులు, ప్రోబయోటిక్‌లు మానసిక ఒత్తిడిని తగ్గిస్తాయి. ఒత్తిడిని కలిగించే కార్టిసాల్ హార్మోన్ ఉత్పత్తిని పెరుగు తగ్గిస్తుంది. ఈ హార్మోన్ నియంత్రణలో ఉంటే బరువు తగ్గుతుంటారు. జ్ఞాపకశక్తి మెరుగుదల: జ్ఞాపకశక్తిని పెంచుకోవాలనుకుంటే ప్రతిరోజూ పెరుగు తినాలి అంటున్నారు నిపుణులు. పెరుగులోని కాల్షియం, విటమిన్ డి జ్ఞాపకశక్తిని మెరుగుపరచడానికి సహాయం చేస్తుంది. చర్మ సంరక్షణ: పెరుగు తినేవారి చర్మం పొడిబారకుండా ఉంటుంది. తేమ వల్ల యవ్వనంగా కనిపిస్తారు కూడా. దురద ఉంటే కూడా పెరుగు తినడం వల్ల ఈ సమస్యకు చెక్ పెట్టవచ్చు అంటున్నారు నిపుణులు. పెరుగులోని జింక్, విటమిన్ సి, కాల్షియం చర్మానికి ఎంతో మేలు చేస్తుంటాయి. ఎముకలు, దంతాల బలం : ఎముకలు, దంతాలను బలోపేతం చేస్తుంది ఈ పెరుగు. వీటికి అవసరమైన ఫాస్ఫరస్, కాల్షియం లు కూడా ఇందులో ఉంటాయి. దీన్ని ప్రతిరోజూ తినడం వల్ల దంతాలు చాలా స్ట్రాంగ్ గా ఉంటాయి. ఎముకలను కూడా బలోపేతం చేయడం వల్ల కీళ్లనొప్పులు రాకుండా నిరోధించుకోవచ్చు. బిపి %డ% షుగర్ నియంత్రణ: పెరుగులోని పోషకాలు సులభంగా జీర్ణం అవడానికి కూడా ఈ పెరుగు ఉపయోగపడుతుంది. దీనిలోని ప్రోటీన్ రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రిస్తుంది. పెరుగులో ఉండే మెగ్నీషియం అధిక రక్తపోటును తగ్గిస్తుంది. గుండె ఆరోగ్యం: ప్రతిరోజూ పెరుగు తీసుకునే వారికి కొలెస్ట్రాల్ స్థాయిలు నియంత్రణలో ఉంటాయి అంటున్నారు నిపుణులు. రక్తపోటు నియంత్రణలో ఉంటుంది. దీని వల్ల గుండె కూడా ఆరోగ్యంగా ఉంటుంది. మెదడుకు మంచిది: పెరుగులో ఉండే ప్రోటీన్ మెదడు కణాల పెరుగుదల , నిర్వహణకు సహాయపడుతుంది అంటున్నారు నిపుణులు. పెరుగు, పంచదార రెండింటినీ కలిపి తింటే మెదడుకు మంచిదట. ఎందుకంటే పెరుగుతో పాటు పంచదార తిన్నప్పుడు లభించే గ్లూకోజ్ మెదడు శక్తిని పెంచడానికి మరింత సహాయపడుతుంది. శరీరాన్ని హైడ్రేటెడ్‌గా ఉంచుతుంది పెరుగు. ఇందులోని టైరోసిన్ వంటి అమైనో ఆమ్లాలు మెదడులో డోపమైన్, సెరోటోనిన్, నోర్‌పైన్‌ఫ్రైన్ వంటి హార్మోన్‌లను నియంత్రిస్తాయి.



మన దునియా
మన అక్షరం - మన ప్రపంచం
మార్చ్ ఆదివారం 8 2026


# నేడు టీ20 వరల్డ్ కప్ ఫైనల్... టైటిల్ కోసం భారత్, న్యూజిలాండ్ అమీతుమీ



క్రికెట్ ప్రపంచం ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న తరుణం రానే వచ్చింది. పొట్టి క్రికెట్ సంగ్రామంలో విశ్వవిజేత ఎవరో తేల్చేందుకు గుజరాత్‌లోని అహ్మదాబాద్ నరేంద్ర మోదీ స్టేడియం ముస్తాబైంది. ఆదివారం (మార్చి 8) జరగనున్న టీ20 ప్రపంచకప్ ఫైనల్ పోరులో డిఫెండింగ్ ఛాంపియన్ భారత్, న్యూజిలాండ్ జట్లు అమీతుమీ తేల్చుకోనున్నాయి. 2024లో సాధించిన టైటిల్‌ను నిలబెట్టుకుని, మూడోసారి విశ్వవిజేతగా నిలిచేందుకు సూర్యకుమార్ యాదవ్ నేతృత్వంలోని టీమిండియా ఉవ్విళ్లూరుతుండగా.. మరోవైపు తమ తొలి టైటిల్ కల సాకారం చేసుకోవాలని కివీస్ పట్టుదలగా ఉంది. టోర్నీ ఆసాంతం ఇరు జట్లు అద్భుత ప్రదర్శన కనబరిచి ఫైనల్‌కు చేరడంతో, ఈ మ్యాచ్ ఆద్యంతం ఉత్కంఠభరితంగా సాగడం ఖాయంగా కనిపిస్తోంది.

బౌలర్లదే కీలక పాత్ర

ఈ మెగా ఫైనల్‌లో ప్రధానంగా భారత పేస్ బౌలింగ్ విభాగానికి, న్యూజిలాండ్ టాప్ ఆర్డర్ బ్యాటర్లకు మధ్య జరిగే పోరు మ్యాచ్ ఫలితాన్ని శాసించే అవకాశం ఉంది. ఈ టోర్నీలో భారత బౌలర్లు జస్ప్రీత్ బుమ్రా, అర్ష్‌దీప్ సింగ్ పవర్ ప్లేతో పాటు డెత్ ఓవర్లలోనూ అద్భుతంగా రాణిస్తున్నారు. ముఖ్యంగా మొదటి ఆరు ఓవర్లలో భారత్ 7.5 ఎకానమీ రేటును నమోదు చేసి ప్రత్యర్థులను కట్టడి చేస్తోంది. అయితే, కివీస్ ఓపెనర్లు టిమ్ సీఫెర్ట్, ఫిన్ అలెన్ భీకర ఫామ్‌లో ఉండటం భారత్‌కు పెద్ద సవాల్. ఈ టోర్నీలోనే అత్యంత వేగవంతమైన సెంచరీ సాధించిన అలెన్, అత్యధిక స్ట్రైక్ రేట్‌తో బౌలర్లపై విరుచుకుపడుతున్నాడు. రికార్డుల ముంగిట హార్దిక్, స్కై

భారత ఆల్ రౌండర్ హార్దిక్ పాండ్యా ఈ ప్రపంచకప్‌లో సంచలన ఫామ్‌లో ఉన్నాడు. ఇప్పటివరకు 199 పరుగులు చేయడంతో పాటు 8 వికెట్లు పడగొట్టి జట్టు విజయాల్లో కీలక పాత్ర పోషించాడు. ఒకే టీ20 ప్రపంచకప్ ఎడిషన్‌లో 200 పరుగులు, 10 వికెట్లు తీసిన తొలి భారతీయ ఆటగాడిగా రికార్డు సృష్టించేందుకు హార్దిక్ అడుగు దూరంలో ఉన్నాడు. ఇక కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ కివీస్ బౌలర్లను సమర్థంగా ఎదుర్కొంటున్నాడు. న్యూజిలాండ్‌పై 58.44 సగటుతో 526 పరుగులు చేసిన స్కై, ఫైనల్‌లోనూ తన బ్యాట్ ఝుళిపించాలని చూస్తున్నాడు. వెస్టిండీస్, ఇంగ్లండ్‌పై వరుసగా 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డులు గెలుచుకున్న సంజూ శాంసన్ కూడా సూపర్ ఫామ్‌లో ఉండటం భారత్‌కు కలిసొచ్చే అంశం. అయితే శాంసన్‌ను అడ్డుకునేందుకు కివీస్ బౌలర్ మ్యాట్ హెన్రీ ప్రత్యేక ప్రణాళికలతో సిద్ధమయ్యాడు.

ఆ సెంటిమెంట్ భయపెడుతోందా?

గణాంకాలు, ప్రస్తుత ఫామ్ భారత్‌కు అనుకూలంగా ఉన్నప్పటికీ.. చరిత్ర మాత్రం కివీస్ వైపే మొగ్గు చూపుతోంది. ఈ ప్రతికూలతలను అధిగమించి సొంతగడ్డపై వరుసగా రెండోసారి కప్పు గెలవాలని రోహిత్ సేన పట్టుదలగా ఉంది. మరోవైపు భారత్‌పై టీ20ల్లో 30 వికెట్లు తీసిన రికార్డు ఉన్న స్పిన్నర్ ఇష్ సోధీని తుది జట్టులోకి తీసుకుని భారత్‌ను దెబ్బకొట్టాలని న్యూజిలాండ్ యోచిస్తోంది.

మొత్తానికి అహ్మదాబాద్ వేదికగా జరగనున్న ఈ చారిత్రక పోరులో గెలుపు ఎవరిని వరిస్తుందో చూడాలి. ఈ మ్యాచ్ ఆదివారం రాత్రి 7 గంటలకు ప్రారంభం కానుంది. స్టార్ స్పోర్ట్స్ నెట్‌వర్క్‌లో ప్రత్యక్ష ప్రసారం, జియో హాట్‌స్టార్‌లో లైవ్ స్ట్రీమింగ్ అందుబాటులో ఉంటుంది.

భారత్: సూర్యకుమార్ యాదవ్ (కెప్టెన్), ఇషాన్ కిషన్, అభిషేక్ శర్మ, తిలక్ వర్మ, హార్దిక్ పాండ్యా, శివమ్ దూబే, రింకూ సింగ్, వాషింగ్టన్ సుందర్, అర్ష్‌దీప్ సింగ్, వరుణ్ చక్రవర్తి, జస్ప్రీత్ బుమ్రా, సంజూ శాంసన్, మహమ్మద్ సిరాజ్, కుల్దీప్ యాదవ్, అక్షర్ పటేల్.

న్యూజిలాండ్: మిచెల్ శాంట్నర్ (కెప్టెన్), టిమ్ సీఫెర్ట్, ఫిన్ అలెన్, రచిన్ రవీంద్ర, గ్లెన్ ఫిలిప్స్, మార్క్ చాప్‌మన్, డారిల్ మిచెల్, కోల్ మెక్‌కాన్చీ, మ్యాట్ హెన్రీ, ఇష్ సోధీ, లాకీ ఫెర్గూసన్, జాకబ్ డఫీ, జేమ్స్ నీషమ్, కైల్ జేమిసన్, డెవాన్ కాన్వే.

# లక్ష్యం ఒక్కటే... ప్రేక్షకుల్ని సైలెంట్ చేయడం: ఫైనల్ ముందు కివీస్ కెప్టెన్ శాంట్నర్ వ్యాఖ్యలు



స్వదేశంలో ఆడుతున్నందున టీమిండియాపైనే తీవ్ర ఒత్తిడి ఉంటుందని వ్యాఖ్య

అహ్మదాబాద్ పిచ్ ఫ్లాట్‌గా, హై స్కోరింగ్‌కు అనుకూలంగా ఉంటుందని అంచనా

బుమ్రా ప్రపంచ స్థాయి బౌలరే అయినా, భారత జట్టులో అందరూ ప్రమాదకరమేనని వెల్లడి

దశాబ్ద కాలంగా నెరవేరని ప్రపంచకప్ కలను నెరవేర్చుకుంటామని ధీమా

"మా లక్ష్యం ఒక్కటే... అహ్మదాబాద్ స్టేడియంలోని లక్షలాది మంది ప్రేక్షకులను నిశ్శబ్దంలో ముంచెత్తడం". టీ20 ప్రపంచకప్ 2026 ఫైనల్స్‌కు ముందు న్యూజిలాండ్ కెప్టెన్ మిచెల్ శాంట్నర్ చేసిన వ్యాఖ్యలివి. స్వదేశంలో, నిండిన స్టేడియంలో టైటిల్ గెలవాలనే తీవ్ర ఒత్తిడి టీమిండియాపైనే ఉంటుందని, ఇదే తమకు అవకాశంగా మారుతుందని అతను ధీమా వ్యక్తం చేశాడు. ఇవాళ జరిగిన ప్రెస్ కాన్ఫరెన్స్‌లో శాంట్నర్ మాట్లాడుతూ... 2023 వన్డే ప్రపంచకప్ ఫైనల్ సమయంలో ఆస్ట్రేలియా కెప్టెన్ పాట్ కమిన్స్ చేసిన వ్యాఖ్యలను పునరావృతం చేశాడు.అహ్మదాబాద్ పిచ్ గురించి అడిగిన ప్రశ్నకు బదులిస్తూ... "నేనింకా పిచ్‌ను చూడలేదు. అది ఇంకా కవర్ల కిందే ఉంది. కానీ, ఇది ఫ్లాట్‌గా, హై స్కోరింగ్‌కు అనుకూలంగా ఉంటుందని అంచనా వేస్తున్నా" అని శాంట్నర్ తెలిపాడు. గతంలో ఇదే వేదికపై జరిగిన ఐసీసీ ఫైనల్ మ్యాచ్ పిచ్‌పై తీవ్ర చర్చ జరిగిన నేపథ్యంలో శాంట్నర్ వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి.టీమిండియా బౌలింగ్ దళంపై, ముఖ్యంగా జస్ప్రీత్ బుమ్రాపై శాంట్నర్ ప్రశంసలు కురిపించాడు. "బుమ్రా గురించి ప్రతి ఒక్కరూ మాట్లాడుకోవాల్సిందే. అతను ప్రపంచ స్థాయి బౌలర్. ఇంగ్లండ్‌తో జరిగిన సెమీఫైనల్‌లో అతనే మ్యాచ్‌ను మలుపు తిప్పాడు" అని కొనియాడాడు. అయితే, భారత జట్టు బలం కేవలం ఒక్కరిపైనే ఆధారపడి లేదని స్పష్టం చేశాడు."ముప్పు కేవలం బుమ్రా నుంచే కాదు. భారత జట్టులో ప్రతి ఒక్కరూ ప్రమాదకరమే. బ్యాటింగ్ లేదా బౌలింగ్‌లో వేర్వేరు సమయాల్లో ఒక్కొక్కరు ముందుకొచ్చి జట్టును గెలిపిస్తున్నారు. ఒక జట్టుగా ఇదే అత్యుత్తమ స్థితి" అని శాంట్నర్ విశ్లేషించాడు. గత దశాబ్ద కాలంగా పలు ఫార్మాట్లలో ప్రపంచకప్ ఫైనల్స్‌కు చేరినా ట్రోఫీని అందుకోలేకపోయిన న్యూజిలాండ్, ఈసారి ఆ కలను నెరవేర్చుకోవాలని పట్టుదలగా ఉంది. మరోవైపు ఈ వేదికపై నాకౌట్ మ్యాచ్‌లలో టీమిండియాకు అద్భుతమైన రికార్డు ఉండటం గమనార్హం.

# లక్ కోసం.. అహ్మదాబాద్‌లో టీమిండియా హోటల్ మార్పు

నరేంద్ర మోదీ స్టేడియంలో గతంలో రెండు కీలక మ్యాచ్‌లు ఓడిపోయిన ఇండియా

దీంతో ఫైనల్ కోసం జట్టు బస చేసే హోటల్‌ను మార్చిన బీసీసీఐ

డ్రెస్సింగ్ రూమ్ కూడా మార్చాలని నిర్ణయం

అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియంలో రేపు భారత్, న్యూజిలాండ్ మధ్య జరగనున్న టీ20 ప్రపంచకప్ ఫైనల్ పోరుపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. ఈ ప్రతిష్ఠాత్మక మ్యాచ్‌కు ముందు టీమ్ ఇండియా బస చేసే హోటల్‌తో పాటు డ్రెస్సింగ్ రూమ్‌ను కూడా మార్చడం ఇప్పుడు చర్చనీయాంశమైంది.గతంలో అహ్మదాబాద్‌లోని ఒక హోటల్‌లో బస చేసినప్పుడు టీమ్ ఇండియా రెండు కీలక మ్యాచ్‌లలో ఓడిపోయింది. దీంతో ఈసారి ఫైనల్ కోసం జట్టు బస చేసే హోటల్ ను బీసీసీఐ మార్చేసింది. గతంలో ఉన్న హోటల్‌కు బదులుగా ఈసారి టీమ్ ఇండియా తాజ్ స్కైలైన్ (ఖుయ ూనిఎశ్రీఅఅవ) హోటల్‌లో బస చేస్తోంది. అంతేకాదు, సాధారణంగా హోమ్ టీమ్‌కు కేటాయించే డ్రెస్సింగ్ రూమ్‌ను కాకుండా, ఈసారి విజిటింగ్ టీమ్ డ్రెస్సింగ్ రూమ్‌ను వాడాలని మేనేజ్మెంట్ నిర్ణయించినట్లు సమాచారం.ఫైనల్ మ్యాచ్ ప్రారంభానికి ముందు స్టేడియంలో ప్రేక్షకులను ఉర్రూతలూగించడానికి ఐసీసీ భారీ ఏర్పాట్లు చేసింది. అంతర్జాతీయ పాప్ స్టార్ రికీ మార్టిన్ ప్రధాన ఆకర్షణగా నిలవనున్నారు. 'దండియా క్వీన్' ఫాల్గుణి పాఠక్, సింగర్స్ సుఖ్బీర్, సుఖ్వీందర్ సింగ్ తమ ప్రదర్శనలతో సందడి చేయనున్నారు. మరోవైపు, ముంబై నుండి అహ్మదాబాద్‌కు వెళ్లే విమాన టికెట్ల ధరలు పెరగడంతో, వెస్ట్రన్ రైల్వే రెండు ప్రత్యేక ఏసీ సూపర్ ఫాస్ట్ రైళ్లను అహ్మదాబాద్ కు నడుపుతోంది.



# పశ్చిమాసియా సంక్షోభం... భారత్ లో చిక్కుకుపోయిన విదేశీ క్రికెట్ జట్ల కోసం ప్రత్యేక విమానాలు

మిడిల్ ఈస్ట్ గగనతల ఆంక్షలతో విమాన సర్వీసులకు అంతరాయం

ఐసీసీ ఏర్పాటు చేసిన ప్రత్యేక చార్టర్డ్ విమానాల్లో జట్ల పయనం

నేడు ముంబై నుంచి లండన్‌కు బయలుదేరనున్న ఇంగ్లండ్ టీమ్

రేపు కోల్‌కతా నుంచి వెళ్లనున్న వెస్టిండీస్, దక్షిణాఫ్రికా జట్లు

ఆరు రోజులుగా కోల్‌కతాలోనే చిక్కుకుపోయామన్న విండీస్ కోచ్

టీ20 ప్రపంచకప్ 2026లో తమ పోరాటం ముగిసినప్పటికీ, స్వదేశానికి వెళ్లలేక భారత్‌లోనే చిక్కుకుపోయిన విదేశీ జట్ల నిరీక్షణ ఎట్టకేలకు ఫలించింది. మిడిల్ ఈస్ట్‌లో నెలకొన్న యుద్ధ వాతావరణం, గగనతల ఆంక్షల కారణంగా విమాన సర్వీసులకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. దీంతో వెస్టిండీస్, ఇంగ్లండ్, దక్షిణాఫ్రికా జట్ల కోసం ఐసీసీ ప్రత్యేక చార్టర్డ్ విమానాలను ఏర్పాటు చేసింది. ఈ వారాంతంలో ఈ మూడు జట్లు భారత్ నుంచి బయలుదేరనున్నాయి. శనివారం సాయంత్రం ఇంగ్లండ్ జట్టు ముంబై నుంచి ప్రత్యేక విమానంలో నేరుగా లండన్‌కు బయలుదేరనుంది. ఇక మార్చి 1న భారత్ చేతిలో ఓడి సూపర్-8 దశలోనే నిష్క్రమించిన వెస్టిండీస్ జట్టు, సెమీస్‌లో కివీస్ చేతిలో ఓడిన దక్షిణాఫ్రికా జట్లు కోల్‌కతాలోనే ఉండిపోయాయి. ఈ రెండు జట్లు ఆదివారం ఒకే చార్టర్డ్ విమానంలో కోల్‌కతా నుంచి జోహన్నెస్‌బర్గ్‌కు వెళ్లనున్నాయి. అక్కడి నుంచి ఆ విమానం విండీస్ ఆటగాళ్లతో ఆంటిగ్వాకు వెళ్లనున్నట్లు సమాచారం. అమెరికా, ఇజ్రాయెల్ దేశాలు ఇరాన్‌పై దాడులు జరపడంతో మిడిల్ ఈస్ట్ మీదుగా వెళ్లే విమానాలకు ఆటంకం ఏర్పడటమే ఈ జాప్యానికి ప్రధాన కారణం.కాగా, వెస్టిండీస్ కోచ్ డారెన్ సామీ శనివారం 'డే 6' అంటూ తాము కోల్‌కతాలో చిక్కుకుపోయి ఆరు రోజులయిందని ట్వీట్ చేశారు. మరోవైపు విండీస్ స్పిన్నర్ అకీల్ హొసేన్.. "క్రిస్టియానో రొనాల్డో తన జెట్ పంపి నన్ను రక్షించడం బెటర్" అంటూ సోషల్ మీడియాలో సరదాగా పోస్ట్ చేశారు. అంతకుముందు జింబాబ్వే జట్టు కూడా ఢిల్లీలో ఇలాగే ఇబ్బంది పడగా, ఐసీసీ గురువారం అడిస్ అబాబా మీదుగా వారిని హరారేకు పంపించింది.



మన దునియా
మన అక్షరం - మన ప్రపంచం





# గద్దర్ తెలంగాణ ఫిల్మ్ అవార్డ్స్2025 విజేతల ప్రకటన

మన దునియా,హైదరాబాద్:మార్చి 07

తెలంగాణ ప్రభుత్వం దివంగత ప్రజా గాయకుడు గద్దర్ పేరిట ప్రవేశపెట్టిన ప్రతిష్టాత్మక గద్దర్ తెలంగాణ ఫిల్మ్ అవార్డ్స్2025 విజేతల జాబితా విడుదలైంది. జ్యూరీ సభ్యులు ఈ జాబితాను డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కకు అందజేశారు. ఉగాది సందర్భంగా మార్చి 19న అవార్డులను ప్రదానం చేయనున్నారు.ఈ ఏడాది ఉత్తమ చిత్రంగా 'రాజు వెడ్స్ రాంబాయి' ఎంపిక కాగా, ద్వితీయ ఉత్తమ చిత్రంగా 'దండోరా', తృతీయ ఉత్తమ చిత్రంగా 'ది ప్రీ వెడ్డింగ్ షో' నిలిచాయి. ఉత్తమ నటుడిగా నాగ చైతన్య (తండేల్), ఉత్తమ నటిగా రష్మిక మందన్న (ది గర్ల్ ఫ్రెండ్) ఎంపికయ్యారు.ప్రత్యేక పురస్కారాల్లో భాగంగా ఎన్టీఆర్ నేషనల్ అవార్డు చిరంజీవికి, పైడి జయరాజ్ అవార్డు కమల్ హాసన్‌కు దక్కగా, నాగిరెడ్డి–చక్రపాణి అవార్డు అశ్వనీదత్‌కు, కాంతారావు అవార్డు ఆర్. నారాయణమూర్తికి లభించాయి. ఉత్తమ దర్శకుడిగా సాయిలు (రాజు వెడ్స్ రాంబాయి) ఎంపిక కాగా, సపోర్టింగ్ నటుడిగా శివాజీ, సపోర్టింగ్ నటిగా భూమిక అవార్డులు అందుకున్నారు. సంగీత దర్శకుడిగా మార్క్ కె రాబిన్ (దండోరా), సినిమాటోగ్రాఫర్‌గా కార్తిక్ ఘట్టమనేని (మిరాయ్), ఎడిటర్‌గా శ్రీకర్ ప్రసాద్ (మిరాయ్) ఎంపికయ్యారు. ఇతర విభాగాల్లో కూడా పలువురు సినీ ప్రముఖులు గద్దర్ తెలంగాణ ఫిల్మ్ అవార్డ్స్‌ను సొంతం చేసుకున్నారు.

# 'భూమా దేవి' నా హృదయానికి దగ్గరైన పాత్ర: రష్మిక

నేషనల్ క్రష్ రష్మిక మందన్న తన కెరీర్‌లో మరో అరుదైన గౌరవాన్ని సొంతం చేసుకున్నారు. వ్యక్తిగతంగా, వృత్తిపరంగా ఎంతో ఉత్సాహంగా ఉన్న రష్మిక.. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రకటించిన 'గద్దర్ తెలంగాణ చలనచిత్ర అవార్డులు–2025'లో ఉత్తమ నటిగా ఎంపికయ్యారు. శనివారం వెలువడిన ఈ ఫలితాల్లో 'ది గర్ల్‌ఫ్రెండ్' చిత్రంలోని ఆమె అద్భుత నటనకు గాను ఈ అవార్డు దక్కింది.ఈ సందర్భంగా రష్మిక సోషల్ మీడియా వేదికగా తన ఆనందాన్ని పంచుకున్నారు. "గద్దర్ ఫిల్మ్ అవార్డ్స్‌లో ఉత్తమ నటిగా ఎంపిక కావడం చాలా సంతోషంగా ఉంది. నిజంగా కృతజ్ఞురాలిని. ఈ సినిమాలో నేను పోషించిన 'భూమా దేవి' పాత్ర నా మనసుకు ఎంతో దగ్గరైంది" అని ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. తనపై నమ్మకం ఉంచిన దర్శకుడు రాహుల్ రవీంద్రన్, గీతా ఆర్ట్స్ సంస్థ, నిర్మాతలకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. అలాగే ఈ గౌరవం దక్కడం పట్ల తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిలకు రష్మిక ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఇది తనకు ఎంతో విలువైనదని ఆమె వ్యాఖ్యానించారు.మరోవైపు, తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎఫ్ డీసీ) చైర్మన్ దిల్ రాజు విలేకరుల సమావేశంలో ఈ అవార్డుల విజేతలను ప్రకటించారు. 'తండేల్' చిత్రంలో అద్భుత నటనకు గాను అక్కినేని నాగచైతన్య 'ఉత్తమ నటుడు' అవార్డును గెలుచుకున్నారు. ఇదే చిత్రం 'ఉత్తమ జాతీయ సమైక్యత' చిత్రంగా కూడా నిలిచింది. ఇక అనిల్ రావిపూడి దర్శకత్వంలో వచ్చిన 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమాకు 'ఉత్తమ వినోదాత్మక చిత్రం' అవార్డు లభించింది. 'ది గర్ల్‌ఫ్రెండ్' విషయానికి వస్తే.. కాలేజీలో ప్రేమలో పడిన ఒక అమ్మాయిని, ఆమె ప్రియుడు ఎలా తన అదుపులో ఉంచుకోవడానికి ప్రయత్నిస్తాడనే ఆసక్తికరమైన కథాంశంతో ఈ చిత్రం తెరకెక్కింది.





# ఆస్కార్ వేదికపై మరోసారి ప్రియాంక .. ప్రజెంటర్‌గా అరుదైన గౌరవం

**98వ ఆస్కార్ అవార్డుల వేదికపై మెరవనున్న ప్రియాంక చోప్రా**

**అధికారిక ప్రజెంటర్‌లలో ఒకరిగా ఎంపికైన గ్లోబల్ స్టార్**

**2016 తర్వాత రెండోసారి అకాడమీ వేదికపై ప్రజెంటర్‌గా పీసీ**

**హాలీవుడ్ నటుడు రాబర్ట్ డౌనీ జూనియర్‌తో కలిసి ప్రజెంటేషన్**

గ్లోబల్ స్టార్ ప్రియాంక చోప్రా మరో అరుదైన గౌరవాన్ని దక్కించుకున్నారు. ప్రపంచ సినీ రంగంలో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా భావించే అకాడమీ (ఆస్కార్) అవార్డుల ప్రదానోత్సవంలో ఆమె ప్రజెంటర్‌గా వ్యవహరించనున్నారు. ఈ విషయాన్ని ప్రియాంక స్వయంగా తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతా ద్వారా అభిమానులతో పంచుకున్నారు. ఈ నెల 16న జరగనున్న 98వ అకాడమి పురస్కారాల వేడుకలో హాలీవుడ్ ప్రముఖులు రాబర్ట్ డౌనీ జూనియర్, విల్ ఆర్నెట్ వంటి వారితో కలిసి ప్రియాంక వేదికను పంచుకోనున్నారు. ఆమె ఆస్కార్ ప్రజెంటర్‌గా వ్యవహరించడం ఇది రెండోసారి. గతంలో 2016లోనూ ఆమె ఈ గౌరవాన్ని అందుకున్నారు. ఇటీవల 95వ ఆస్కార్ వేడుకల్లో 'ఆర్ఆర్ఆర్' చిత్రంలోని 'నాటు నాటు' పాటను దీపికా పదుకొణె ప్రపంచ వేదికపై పరిచయం చేయగా, ఇప్పుడు మరోసారి ఓ భారతీయ నటి అకాడమీ వేదికపై మెరవనుండటం విశేషం. ఇటీవలే ప్రియాంక కే-పాప్ స్టార్ లీసాతో కలిసి గోల్డెన్ గ్లోబ్ అవార్డును కూడా ప్రదానం చేశారు. సినిమాల విషయానికొస్తే, ఆమె నటించిన 'ది బ్లఫ్' ఓటీటీలో మంచి ఆదరణ పొందింది. ప్రస్తుతం దర్శకుడు రాజమౌళి, మహేశ్ బాబు కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న 'వారణాసి' చిత్రంతో ప్రియాంక బిజీగా ఉన్నట్లు సమాచారం. కాగా, ఈ ఏడాది ఆస్కార్ బరిలో 'సిన్నర్స్' చిత్రం ఏకంగా 16 నామినేషన్లతో అగ్రస్థానంలో నిలిచింది.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY AAKULA SUDHAKAR, PUSHPALATHA PUBLICATIONS AND PRINTING, HNo: 1-83, B.C.Colony, BOLLONIPALLY ARSHANPALLY, NALLABELLY MANDALAM, WARANGAL DIST - 506349, TELANGANA STATE, PUBLISHED PUSHPALATHA PUBLICATIONS HNo. 1-83, B.C.Colony, BOLLONIPALLY ARSHANPALLY, NALLABELLY MANDALAM, WARANGAL DIST- 506349.TELANGANA STATE,TITEL-code : RNI NUMBER ; TELTEL-2023/85680, Cel1 No: 9603969335, MANADUNIA 2022 @ gmail.com